ENTERED E

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జనవరి 2, 2011

స్నేహ







ఊరు మారుతోంది!

2011 హ్యాపీబర్త్‌డే

(2011 జనవరి 2 నుంచి
2011 జనవరి 8 వరకు)

ఎ.తేజస్
2సం॥,జనవరి-2009
సదాలక్ష్మి-మధురాం
బాగ్అంబర్‌పేట్-హైదరాబాద్

సిహెచ్. రాణాప్రతాప్
3సం॥,జనవరి-3
సుజాత-రాజశేఖర్
బాల్టిమోర్-అమెరికా

రిషిత్
1సం॥,జనవరి-2010
రేణుక-నాగభూషణం
కాగజ్‌ఘట్-రంగారెడ్డి

జె.శ్రీయాన్స్
1సం॥,జనవరి-7
సరిత-వెంకటేష్(జె.వి)
ధర్మన్నగూడ-రంగారెడ్డి

త్విష కళాన్కర్
1సం॥,జనవరి-5
పద్మావతి-నారాయణ
మహబూబ్‌నగర్

ఎన్. రక్షిత్
4సం॥,జనవరి-2007
రమ్య-శ్రీనివాస్
లక్ష్మీపురం-వరంగల్

వై. రక్షిత్
2సం॥,జనవరి-5
ధనలక్ష్మి-సుబ్రమణ్యం
అత్తంటివారిపాలెం
-ప్రకాశం

ఎన్.మౌనిక
4సం॥,జనవరి-7
నాగమణి-సత్యమూర్తి
మాధవధార-విశాఖ

పి. ప్రణీత
2సం॥,జనవరి-3
సరస్వతి-జమలయ్య
జవహర్‌నగర్-హైదరాబాద్

బి.లోహిత్
2సం॥,జనవరి-2009
సత్యకుమారి-కృష్ణకిషోర్
జగ్గయ్యపేట-కృష్ణా

ఫరీన్ ముస్కన్
7సం॥,జనవరి-2004
షాహీన్ సుల్తానా-సయ్యద్
నహీముద్దీన్
డిచ్‌పల్లి-నిజామాబాద్

ఉమర్‌రాజా
3సం॥,జనవరి-3
షబానారాజా-అయబ్ రాజా
డోర్నకల్-వరంగల్

పి. సాయి కుమార్-కళ్యాణి
జనవరి-4
ముత్తమ్మ-సైదులు
తేరట్‌పల్లి-చండూరు

మనలో మాట

అడ్మిషన్లు...అగచాట్లు...

చూస్తుండగానే జనవరి వచ్చేసింది. అమ్మానాన్నలకు గంపెడు భారం తెచ్చేసింది. అవును మరి...చిన్నారులను 'మంచి స్కూల్లో' వేయడం చిన్న పనా! ఏ స్కూలైతే బావుంటుంది? దరఖాస్తులు ఎప్పుడిస్తారు? ఇంటర్వ్యూలు ఎప్పుడుంటాయి? ఫీజులు ఎంతెంత వుంటాయి? అందుకు అవసరమైన డబ్బు ఎలా సమకూర్చుకోవాలి? చిట్టీ పాడాలా? ఫైనాన్సర్ దగ్గరకెళ్లాలా? స్థిరాస్తులేమైనా కుదవ పెట్టాలా? మనసంతా ఒకటే అలజడి.

అసలు సీటొస్తేకదా ఫీజు కట్టాలన్న సమస్య ఉత్పన్నమయ్యేది! అందుకే పుస్తకాల పురుగుల్లా మారిపోతారు. పొద్దునంతా ఇంటిపని/ఆఫీసుపని. రాత్రంతా చదువు. 'ఆకాశమంత' సినిమాలో ప్రకాష్‌రాజ్ అవతారమెత్తుతారు. ఎప్పుడో జూన్‌లో మొదలయ్యే స్కూళ్లకు ఇప్పటినుంచే సన్నాహాలు.

ఐఎఎస్ పరీక్ష స్థాయిలో చదవాలి. పిల్లలకూ నేర్పించాలి. కనీసం రంగులూ, పూలూ, కాయల పేర్లయినా కంఠస్తం చేయించాలి. మరోవైపు గూఢచారుల్లా పాఠశాలల్లో దరఖాస్తులు ఎప్పుడిస్తారో తెలుసుకోవాలి. దాని ధరా తక్కువేం కాదు. రు.150 నుంచి రు.5000 వరకు వుంటుంది. ఆ ఘట్టం విజయవంతంగా ముగిశాక అసలు సిసలు అంకం మొదలౌతుంది.

అడ్మిషన్‌కి రమ్మంటూ వారు పంపే లేఖ కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూడాలి. వారు చెప్పినరోజు ఇంటర్వ్యూకి వెళ్లాలంటే ఆఫీసుకు సెలవు పెట్టాలి. తల్లిదండ్రులు పాపను తీసుకొని చెప్పిన సమయానికి హాజరవ్వాలి. అక్కడ చూస్తే చాంతాడంత క్యూ. తమ వంతు వచ్చేసరికి ఏ మధ్యాహ్నమో అయినా ఆశ్చర్యంలేదు. అసలు లోపల ఏమేం ప్రశ్నలడుగుతున్నారోనని ఒక టెన్షన్. తీరా లోపలికెళితే పెద్దల చదువులు, ఉద్యోగాలు, రాబడి గురించే ప్రధానమైన ప్రశ్నల పరంపర వుంటుంది. మరి తమ స్కూల్లో సీటిస్తే అసలు ఫీజు, మధ్యమధ్యలో విధించే కొసరు ఫీజులు కట్టగలరో లేదో తెల్సుకోవాలంటే భేషైన మార్గం ఇదేకదా.

అన్నీ సంతృప్తిగా అనిపిస్తే 'పాప చాలా తెలివిగలది. అందుకే సీటిచ్చాం' అంటారు నవ్వుతూ. 'హమ్మయ్య...కష్టం ఫలించింది. సీటొచ్చింది' అనుకోవడం పెద్దల వంతు. ఫీజు సంగతంటారా! లకారాల్లోనే. గీసి గీసి బేరమాడితే పదో పరకో తగ్గిస్తార్లెండి. 'తాంబూలాలిచ్చాం. తన్నుకు చావండి' అన్న రీతిలో వుంటాయి ఆ తర్వాతి కష్టాలు. ఆటోలు, బస్సులు, ట్యూషన్లు, డొనేషన్లు, టరమ్ ఫీజులు... ఒకటా రెండా నూటొక్క సమస్యలు.

కాన్సెప్టు స్కూళ్లు, పబ్లిక్ స్కూళ్లు, కార్పొరేట్ స్కూళ్లు, కాన్వెంట్లు, మిషనరీ స్కూళ్లు...పేరేదైనా అంతా ప్రయివేటుదే హవా! చదువు అంగట్లో సరకయ్యాక ఇంతకంటే భిన్నంగా వుంటుందా! కొనగలిగినవారికే చదువు కాన్సెప్టు ఇది. ★

ఈ సంచికలో....

టపా	...	2
ఈ పేజ్	...	3
కవిత్వమ్	...	6
కొత్త పుస్తకాలు	...	7
సీరియల్	...	8
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
రుచి	...	17
కథ	...	18
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

జర్నలిస్టులకు శిరోధార్యం
చైనాపై అరుణ తార

సినిమా కబుర్లు ... 10

మూకీల కన్నా ముందే
మన సినీ బంధం

వికాసం ...20

ఈ ఏడాది
మీదే కావాలంటే



నయనానందం

డైరీ కొందరికి ప్రాణపదం అనడం బాగుంది. మిడత తెలివి ఉడతకు లేదు. నయాగరా ముచ్చట్లు బాగున్నాయి. మాంసాహార వంటకాలు మనకు పనికి రావు. శ్యామ్ క్రిస్మస్ తాతకు కృతజ్ఞత చెప్పడం బాగుంది. సూపర్ కటింగ్ పేరుకు తగ్గట్టుంది. 'హేమలతగారికి స్ఫూర్తినిచ్చిన 'రక్తాశ్రువులు' పుస్తకం అందరూ చదవాలి.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

స్ఫూర్తి ప్రదాత

ఎన్.ఎస్. అర్జున్ రాసిన "ఆదర్శనీయుడైన ప్రజాప్రతినిధి' వ్యాసం చాలా బాగుంది. ఇటువంటివి ప్రచురణ జరిగితే కొంత మందిలోనైనా మార్పువచ్చే అవకాశం ఉంది. వారం వారం స్ఫూర్తి పేజీ చదవాలని ఎదురు చూస్తుంటాము. దీనివల్ల పుస్తకాలు చదవాలనే ఉత్సాహం పెరుగుతుంది. మంచి ఆర్టికల్స్ ఇస్తున్నందుకు అభినందనలు.

కె.స్వామి, తణుకు.

దివ్యానుభూతి

19-12-20 సంచికలో నయాగరా సొగసులు అలరించాయి. హిమనగరి సొగసులవలె నయాగరా సొగసులు అద్భుతం. అమెరికా కెనడాల మధ్య వున్న ఈ విశాల జలపాతం పర్యాటకులకు దివ్యానుభూతి కలిగిస్తుంది. చక్కటి వ్యాసం.

ఆచార్య నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం, హైదరాబాద్.

విజ్ఞానదాయకం

కవర్‌స్టోరీ వికీలీక్స్ విస్ఫోటనం విజ్ఞానదాయకంగా వుంది. వికీలీక్స్ పేరుతో వెబ్‌సైట్ 2006 అక్టోబర్ 4న రిజిష్టరైంది. వికీలీక్స్ విడుదల చేసిన పత్రాలకు ముఖ్యమైన పత్రికలు పతాక శీర్షికల్లో స్థానం కేటాయించాయి. అమెరికా విదేశాంగ నీతికి సంబంధించిన కీలక పత్రాలు వికీలీక్స్ బయట పెట్టింది. ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత కోసం వికీలీక్స్ చేబట్టిన చర్యలు ఉద్యమరూపం తీసికొనడం హర్షించదగ్గ పరిణామం.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

గమ్మత్తైన విషయాలు

'స్నేహ'... అట్టమీదికథ 'వికీలీక్స్ విస్ఫోటనం' అంశం ఆసక్తికరంగా ఉంది. 'ఓ యామినికథ' బావుంది. బాలనేస్తాలు పేజీలు సరదాగా ఉన్నాయి. 'మంచి బహుమతి' కథ సమయానుకూలంగా అందించారు. 'సూపర్ కటింగ్ అదిరింది. 'తెల్సా' పేజీలో మిడత తెలివి, తొలి పెంపుడు పిల్లి, బుల్లిచేప, నారికేళం సముద్రయానం విశేషాలతో గమ్మత్తైన విశేషాలను తెలియచేశారు. రెంటాల జూనియర్ 'సినిమా కబుర్లు' వాస్తవాలతో కూడి ఉన్నాయి. 'చూద్దామా'లో నయాగరా సొగసులు గురించి కళ్లకుకట్టినట్టు వివరంగా తెలియచేయటం అభినందనీయం. రాజ్మా విందులు చవులూరింపజేసాయి. 'కవిత్వమ్'లో అడిగోపుల వెంకటరత్నంగారి రచన బాల్యాన్ని నెమరువేస్తే, కొండపల్లి నిహారిణి గారి రచన అమ్మతనంలోని కమ్మదనాన్ని చవి చూపారు. 'ఈపేజ్ ద్వారా అలెక్సా రేటింగ్‌లో 'గూగుల్ దే హవా అని తెలుస్తోంది. 'వియత్నాం వీరుడు' ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్ సీరియల్ ఉత్కంఠగా కొనసాగుతోంది. 'మనలో మాట....వాస్తవికంగా వుంది. నిజంగానే మనలో డైరీ రాయని భాస్కరులే ఎక్కువగా ఉంటారు.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళంటౌన్.

గుర్తుండిపోయే పాత్ర

యామిని

డాక్టర్ నార్మన్ బెతూన్ ప్రజలకు సేవ చేస్తూ... తాను ఈ విషయాన్ని ప్రజల నుండి నేర్చుకొన్నానని ఆనందంతో తెలపడం గొప్ప విషయం. మనమూ నేర్చుకొని అమలుచేయ తగ్గది. డాక్టర్ బెతూన్ సాధారణ

మహిళకు ప్రసవం చేసి, పుట్టిన బిడ్డ నెల రోజులకంటే బతకదని, అందుకు కారణం పేదరికమని చెప్పడం నా అనుభవంలో ఎక్కడా వినలేదు. ఇది చదువుతున్నప్పుడు డాక్టర్ పుచ్చలపల్లి రామచంద్రారెడ్డిగారి గురించి విన్నది గుర్తుకొచ్చింది. 'రక్తాశ్రువులు' చదివి తాను స్ఫూర్తి పొందడమేకాక మానవ విలువలుగల ఆ పుస్తకాన్ని చదవడానికి మనల్ని ఉత్సాహపరిచినందుకు డా॥ హేమలతగారికి ధన్యవాదాలు. రామనాథం విద్యార్థులకి పాఠాలు నేర్పిన లెక్చరరు. కానీ అతడు సమాజ నియమాలు, మానవ జీవితానుభవాలు నేర్పని పురుషాధిక్య స్వభావం కలవాడు. అతని కుమారులూ అదే స్వభావం గలవారు. దీనికి బలైన ఆడకూతురు యామిని. ఈ కథ చదివిన వారికి చిరకాలం గుర్తుండిపోయే పాత్ర అది.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
భీమనవారి పేట,
విజయవాడ. ★

ఈ-పేజ్

టాప్ 10 బ్రౌజర్లు

బ్రౌజరు గురించి క్లుప్తంగా రెండు ముక్కల్లో చెప్పమంటే! ఇంటర్నెట్‌లో ఉన్న కోట్లాది వెబ్ పేజీలను మన కంప్యూటర్ ద్వారా చూడగలిగే సౌకర్యం కల్పించే సాఫ్ట్‌వేరే బ్రౌజర్. బ్రౌజర్ అంటే వెబ్‌పేజి కాదు! శోధన యంత్రం (సెర్చ్ ఇంజన్) కాదు! శోధన యంత్రం కూడా ఒక వెబ్ పేజీనే. వెబ్ బ్రౌజర్ అంటే ఒకప్పుడు కేవలం ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్ మాత్రమే. ఓపెన్‌సోర్స్ ఉద్యమం మొదలైన తర్వాత ఉచిత సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చెందడంతో ఇటీవల కాలంలో అనేక సాఫ్ట్‌వేర్లు వాడుకలోకి వచ్చాయి. అనేక సంస్థలు బ్రౌజర్ సాఫ్ట్‌వేర్లను ఉచితంగానే అందిస్తున్నాయి. ముందు వరుసలో వున్న 10 బ్రౌజర్లేవంటే... ఫైర్‌ఫాక్స్, గూగుల్ క్రోమ్, ఒపేరా, ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్... వంటివి. ఇవన్నీ తెలుగులో కూడా లభ్యమవుతున్నాయి వాటి వివరాలు.

ఫైర్‌ఫాక్స్: మోజిల్లా ఫైర్‌ఫాక్స్ బ్రౌజర్ ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్ కన్నా స్థిరంగా పనిచేస్తుండడం వల్ల ఎక్కువమంది నెటిజన్లు దీన్నే ఉపయోగిస్తున్నారు. తక్కువ మెమరీ తీసుకుంటుంది. వేగంగా పనిచేస్తుంది. ఫైర్‌ఫాక్స్‌ను మన అవసరాలకు అనుగుణంగా కస్టమైజ్ చేసుకోవడానికి అనేక అవకాశాలున్నాయి. ముఖ్యంగా బ్రౌజర్ ద్వారానే అనేక పనులు చేసుకోవడానికి వీలుగా ఉచిత యాడ్ ఆన్స్‌లు లభిస్తున్నాయి.

క్రోమ్: బ్రౌజర్ల ప్రపంచంలో ఇప్పటివరకూ ఫైర్‌ఫాక్స్ -ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్ మధ్య సాగుతున్న ఆధిపత్య పోరులో ఇప్పుడు గూగుల్ వారి క్రోమ్ బ్రౌజర్ కూడా ప్రవేశించింది. ఫైర్‌ఫాక్స్‌లో వున్నన్ని ఫీచర్లు దీనిలో లేకపోయినా గూగుల్ సంస్థ అందిస్తున్న ఈ బ్రౌజర్ చాలా తేలికగా పనిచేస్తుంది. ఫైర్‌ఫాక్స్ మాదిరిగానే వేగంగా పేజీలను ఓపెన్ చేయాలంటే గూగుల్ క్రోమ్ బ్రౌజర్ చక్కగా ఉపయోగపడుతుంది. ఫైర్‌ఫాక్స్‌లో వున్న కొన్ని బ్రౌజర్ ఫీచర్స్ ఇందులో లేవు. ఈ బ్రౌజర్‌లో తెలుగుకి మంచి మద్దతు వుంది. ప్రధాన భాషగా తెలుగుని పెట్టుకోవచ్చు. తెలుగు యూనికోడ్‌ని కూడా బాగానే చూపుతుంది. అయితే బరహా, అక్షరమాల యూనికోడ్ టైపింగ్ టూల్స్ దీనిలో సరిగా పనిచెయ్యట్లేదు. ఫైర్‌ఫాక్స్‌లో మాదిరిగా పద్మ, ఇండిక్ ఇన్‌పుట్ ఎక్స్‌టెన్షన్ వంటి యాడాన్స్ సదుపాయం కూడా లేదు. దీన్ని www.google.com/chrome నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్: ఒకప్పుడు ఇంటర్నెట్‌కు మారుపేరుగా నిల్చిన మైక్రోసాఫ్ట్ ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్ ఇప్పుడు గడ్డు రోజులను ఎదుర్కొంటోంది. అదేవిధంగా సాఫ్ట్‌వేర్ తయారీలో నెంబర్‌వన్‌గా వున్న మైక్రోసాఫ్ట్ ప్రస్తుతం ఇంటర్నెట్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్ తయారీలోనూ వెనకబడివుంది. ఇంటర్నెట్‌సర్వీస్‌ల విషయంలో కూడా గూగుల్, యాహూ, తర్వాతనే మైక్రోసాఫ్ట్ స్థానం. ప్రస్తుతం ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్ 9 బీటా వెర్షన్ అందుబాటులో వుంది. అత్యంత అధునాతన ఫీచర్లతో తయారైన ఐఇ9 వెర్షన్ విండోస్ ఎక్స్‌పీ ఆపరేటింగ్ సిస్టమ్‌లో పనిచేయకపోవడం విశేషం. ఈ బ్రౌజర్ విండోస్ విస్టా, విండోస్7లలో మాత్రమే పనిచేస్తుంది.

ఒపేరా: ఒపేరా సంస్థ అందిస్తున్న ఈ బ్రౌజర్ చాలా వేగంగా పనిచేస్తుంది. మన దేశంలో చాలా తక్కువ శాతం మంది ఈ బ్రౌజర్‌ను ఉపయోగిస్తారు. అయితే వెబ్‌పేజీలను డౌన్‌లోడ్ చేయడంలోను బ్రౌజింగ్‌కు కావాల్సిన హంగులను అందించడంలోను ఈ బ్రౌజర్ బాగా ఉపయోగపడుతుంది. ఈ బ్రౌజర్ తెలుగు వెర్షన్ కూడా లభ్యమవుతోంది. దీన్ని www.opera.com నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



సఫారీ: ఆపిల్ సంస్థ విడుదల చేసిన ఈ బ్రౌజర్ కూడా ప్రాచుర్యాన్ని పొందింది. అయితే ఈబ్రౌజర్ కూడా వెబ్ పేజీలను డౌన్‌లోడ్ చేయడంలో చాలా స్లోగా పనిచేస్తుంది. ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్, ఫైర్‌ఫాక్స్ మాదిరిగానే అనేక ఫీచర్లు దీనిలో వున్నాయి. దీన్ని www.apple.com/safari నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

మ్యాక్స్‌థాన్: ఈ బ్రౌజర్ ఇటీవలి కాలంలో వాడుకలోకి వచ్చింది. సులువుగా, వేగంగా పనిచేసే ఈ బ్రౌజర్‌పట్ల అనేకమంది నెటిజన్లు మక్కువ చూపుతున్నారు. ఇది చైనాలో తయారైన బ్రౌజర్. ఈ బ్రౌజర్ అన్ని విషయాలలోనూ తేడాలతో ఉంటుంది. గూగుల్ వారి క్రోం లో కంటే ఈ బ్రౌజర్ లోని ఇంటర్ ఫేస్ లో కూడా ఇంటర్ ఫేస్ ని మార్చుకునే సౌకర్యాలు ఎక్కువగా ఉన్నాయి. కీ బోర్డ్ మూలంగా ఈ బ్రౌజర్ని వాడుకునే అవకాశంతో పాటు మరెన్నో సదుపాయాలున్నాయి. దీన్ని http://maxthon.com/ వెబ్‌సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు.

ఫ్లాక్ : ఈ బ్రౌజర్ కూడా క్రోమ్, మాక్స్‌థాన్ బ్రౌజర్ల మాదిరిగానే తక్కువ ఫీచర్లని కలిగివుంది. ఉచితంగా లభించే ఈ బ్రౌజర్లు మున్ముందు మరిన్ని ఫీచర్లతో అందుబాటులోకి వస్తాయి. వెర్షన్ 3.5.0 ప్రస్తుతం అందుబాటులో వుంది. ఇది ఒక సోషల్ వెబ్ బ్రౌజర్. ఒక పక్క బ్రౌజ్ చేస్తూనే మరోవైపు నేస్తాలతో చాట్ చేసే సౌకర్యం వుంది. అలాగే సోషల్ నెట్వర్క్‌లను కూడా చూసుకోవచ్చు. ఫోటో అప్‌లోడ్, ఎడిట్, వాటిని మన కంప్యూటర్లో నుండి పికాసా, ఫొటో బకెట్, టైనీపిక్‌లకు సౌలభ్యం కూడా వుంది. బ్లాగ్ పోస్టులను ఈ బ్రౌజర్‌లోని బ్లాగ్ ఎడిటర్ నుంచి పోస్టు చేయవచ్చు. ఇంకా అనేక సౌకర్యాలున్న ఈ బ్రౌజర్ చాల సులువుగా వాడుకోవచ్చు. దీన్ని http://flock.com/ నుండి డోన్లోడ్ చేసుకోవచ్చు.

అవాంట్ బ్రౌజర్ : ఈ బ్రౌజర్‌ని కూడా అనేకమంది నెటిజన్లు ఉపయోగిస్తున్నారు. బ్రౌజింగ్ అనేది నిరంతరం జరిగే ప్రక్రియ. కాబట్టి పలు బ్రౌజర్లని టెస్ట్ చేసి ఉత్తమమైన వాటిని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. లేదా ప్రత్యేకంగా వాటిని సేకరించి పెట్టుకోవాలి. ఉపయోగించే బ్రౌజర్ కొంత సమయం సతాయిస్తుంటే ఈ కొత్త బ్రౌజర్లని ఇన్‌స్టాల్ చేసుకునే వీలుంది. దీన్ని www.avantbrowser.com వెబ్‌సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవాలి.

బ్రౌజర్లు అనేకం అందుబాటులో వున్నప్పటికీ వాడుకలో వున్నవి మాత్రం ఫైర్‌ఫాక్స్, ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్, సఫారీ, క్రోమ్, ఒపెరా వంటివి బాగా వాడుకలో వున్నాయి.

-కె.ఎక్స్.రాజు

స్ఫూర్తి

- ఎస్. వినయకుమార్,
ప్రజాశక్తి సంపాదకులు.

ఒక జర్నలిస్టుగా సమకాలీన ధోరణులను మదింపు చేయగల, అమెరికాలోని ప్రజలకు వాటిని స్పష్టంగా వివరించగల దీక్షగల రిపోర్టర్‌గా తనను తాను నిరూపించుకొన్నారు స్నో. చైనాపై జపాన్ చేసిన దురాక్రమణ మీద "దూరప్రాచ్య యుద్ధ రంగం" పేరుతో మరో పుస్తకం ప్రచురించారాయన. 'చైనాపై అరుణతార' పుస్తకంలో కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి గల అవకాశాన్ని అంచనా వేసి చెప్పారు. ఆయన చెప్పినట్లుగానే కమ్యూనిస్టు పార్టీ విజయం సాధించింది. నాయకుల నుండి కార్యకర్తల నుండి సేకరించిన వివరాలతో 600 పేజీలు సాగే మహాగ్రంథం 'చైనాపై అరుణతార'. ఇంటర్వ్యూల్లో నాయకులు, కార్యకర్తలు వివరించిన సంఘటనలను జాగ్రత్తగా నోట్ చేసుకొని, వాస్తవాలకు విఘాతం కలుగకుండా వాటిని ఆసక్తి కరమైన రిపోర్టులుగా మలిచి పాఠకులకు సమగ్రంగా అందించారు ఎడ్గార్ స్నో.

జర్నలిస్టులు తమ వృత్తిలో పాటించాల్సిన ఉత్తమ ప్రమాణాలను స్నో సల్పిన కృషిని ఆయన రిపోర్టులు తెలియచేస్తాయి. ఏ విధంగా చూసుకొన్నా జర్నలిస్టులకు ఆ గ్రంథం శిరోధార్యం. చైనా కమ్యూనిస్టు పార్టీ విజయవంతంగా నిర్వహించిన మహా ప్రస్థానం గురించి తెలుసుకోవడానికి ఎవరికైనా చక్కటి మార్గం.

జర్నలిస్టులకు శిరోధార్యం చైనాపై అరుణతార

ఎంచుకొన్న వృత్తిపట్ల పూర్తి ఆసక్తి, అకుంఠిత దీక్ష చూపిన పాత్రికేయుల్లో చెప్పుకోతగిన అంతర్జాతీయ స్థాయి జర్నలిస్టు ఎడ్గార్ స్నో. అమెరికా వాడయినప్పటికీ రిపోర్టింగ్ పట్ల శ్రద్ధతో ప్రాచ్యదేశాల్లో పని చేయడానికి సిద్ధపడినవారు. ఆ సమయంలో ప్రాచ్యదేశాలు దురాక్రమణలు యుద్ధాల్లో మునిగి తేలుతున్నాయి. అంతటా కల్లోల వాతావరణం. అలాంటి సంక్షోభిత పరిస్థితులు ఒక రిపోర్టర్‌కు చేతి నిండా పని కల్పించి గుర్తింపు తెచ్చేవే అయినప్పటికీ అందుకు ఎంతో నిబద్ధత, తెగింపు, చొరవ కావాలి. వాటన్నింటిని పుష్కలంగా ప్రదర్శించి చాంగ్‌కై షేక్ మూకల నిర్బంధాన్ని ఎదుర్కొని 13 ఏళ్ల పాటు చైనాలో ఉంటూ అమెరికన్, బ్రిటన్ పత్రికలకు స్నో రిపోర్టు చేశారు. చైనా కమ్యూనిస్టులపై ప్రపంచమంతా ఎన్నో అపోహలు నిండి ఉన్న ఆ సమయంలో మహాప్రస్థానాన్ని పూర్తి చేసుకుని యానాన్‌లో ఉన్న కమ్యూనిస్టుపార్టీ నాయకులను, కార్యకర్తలను కలిసి వారితో మాట్లాడి అమెరికన్ బ్రిటిష్ పత్రికలకు వార్తలు పంపారు. ప్రపంచానికి వాస్తవాలను అందించారు. ఆయన పంపిన రిపోర్టులే ఆ తర్వాత 'రెడ్‌స్టార్ ఓవర్ చైనా' (చైనాపై అరుణతార) పేరుతో పుస్తక రూపంలో వెలువడ్డాయి.

స్కూల్ రోజుల నుండే జర్నలిస్టులంటే నాకు తెలియని మోజు. జర్నలిజం గురించి పెద్దగా తెలియక ముందు నుండే ఆ భావం ఉండేది. మా ఊళ్లో ఒకాయన ఎప్పుడూ టిప్‌టాప్‌గా ఉంటూ చేతిలో ఏదో పుస్తకంతోనో, పత్రికతోనో కన్పించే వారు. ఆయన ఒక విలేకరి అని నాకెవరో చెప్పారు. నేను జాగ్రత్తగా ఆయనను గమనించేవాడిని. ఆయన విలేకరి కాదని కాలేజీ చదువు చదివిన వ్యక్తి మాత్రమేనని తెలిసిన రోజు నీరుగారిపోయాను. అప్పట్లో జిల్లా కేంద్రాల్లో కూడా విలేకరులుండేవారు కాదు. డిగ్రీ చదువుతున్న రోజుల్లో అప్పటి ముఖ్యమంత్రి పి.వి నరసింహారావు శాసనసభలో భూసంస్కరణల సవరణ చట్టం పెట్టి ఆమోదం పొందారు. ఆ 'విజయోత్సాహం' తో చట్టం గురించి ప్రజలకు వివరించడానికి మహబూబ్‌నగర్ జిల్లా పాలెంలో మొదటి సభను ఏర్పాటు చేశారు. అది చిన్న గ్రామమే. సైన్స్ కళాశాల, ప్రాచ్యకళాశాల ఉన్న ఊరు. సభ సాయంకాలం. మధ్యాహ్నానికే చాలామంది అధికారులు, శాసనసభ్యులు, హైదరాబాదు నుండి విలేకరులు పాలెం చేరుకొన్నారు. సభ ప్రారంభానికి ముందు ఊరికి కాస్త దూరంగా ఉన్న సైన్స్ కళాశాలను సరదాగా సందర్శించారు. అలా సందర్శించిన ఎమ్మెల్యేలలో నక్రేకల్ నుండి ఎన్నికయిన కమలమ్మ ఒకరు. ఆ సందర్భంగా ఆమెను ఇతర ఎమ్మెల్యేల తోపాటు విలేకరులు కూడా ఆటపట్టించడం మొదలెట్టారు. అప్పటిదాకా నాకు తెలిసిన ఎమ్మెల్యే రాణి కుముదిని దేవి మాత్రమే. ఆమె వనపర్తి సంస్థానం రాజుగారికి పిన్నమ్మ. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఆమెకు లేదు. కాగా కమలమ్మను ఇతర ఎమ్మెల్యేలతోపాటు విలేకరులు కూడా ఆటపట్టించడం చూసి చాలా ఆశ్చర్యం కల్గింది. ఎమ్మెల్యేను విలేకరులు ఆట పట్టించగలరా!...ఇకనేం నా దృష్టిలో విలేకరుల పొజిషన్ మరింత పెరిగిపోయింది.

కాస్త అసందర్భమే అయినా ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ఆరోజు సభలో పి.వి. నరసింహారావు చేసిన ప్రసంగంలో రెండు వాక్యాలు నాకు గుర్తుండిపోయాయి. "ఈ చట్టం తెచ్చినా భూస్వాములు తమ భూముల్ని దాచిపెడ్తారని కొందరు చెప్తున్నారు. అదెలా సాధ్యం. భూమి అంటే సూదా? దబ్బణమా? దాచిపెట్టడానికి" అని ఆ సభలో పి.వి ప్రశ్నించారు. అప్పటి సిపిఐ నాయకుడు

వేములపల్లి శ్రీకృష్ణ చట్టం గురించి గొప్పగానే మాట్లాడారు. అప్పటికే పత్రికలు, పుస్తకాలు చదివే అలవాటు ఉండటం వల్ల నా అభిప్రాయాలు నాకు ఉన్నాయి. పి.వి దేశ ప్రధాని అయ్యాక ఆయన కుటుంబానికి చెందిన 600 ఎకరాల భూమి పంచకుండా అలా పడి ఉందనే వార్త దానిపై చర్చోపచర్చలు ప్రముఖంగా వచ్చాయి. ఆ చర్చలు విన్నప్పుడల్లా భూమి సూదా? దబ్బణమా? అంటూ పి.వి చేసిన ప్రసంగం గుర్తుకొచ్చేది. పి.వి ముఖ్యమంత్రిగా, ప్రధానిగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు ఆయన దగ్గర కార్యదర్శిగా పని చేసిన పి.వి.ఆర్.కె ప్రసాద్ తన ఆత్మకథలో భూసంస్కరణల చట్టాన్ని ప్రస్తావిస్తూ. అది అమలు జరిగిన తీరుపై పెదివి విరవడం గమనార్హం.

కాలేజీ రోజుల్లోనే ఎడ్గార్ స్నో రాసిన 'చైనాపై అరుణతార' పుస్తకం మొదటిసారి చదివాను. జర్నలిజంపై మక్కువ ఉన్న వారెవరయినా ఈ పుస్తకం చదివితీరాల్సిందే. చైనా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాగిన మహాప్రస్థానం (లాంగ్‌మార్చ్)పై ఎన్నో వివరాలు సేకరించి అందులో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి రాసిన పుస్తకమిది. ఆ పుస్తకం తెలుగు అనువాదాన్ని 1996లో పునర్ముద్రించారు. ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకుడు, సిపిఎం నేత మోటూరు హనుమంతరావు ముందుమాటలో ఆ పుస్తకాన్ని చైనా యోధుల నక్షత్రమాలగా అభివర్ణించారు. ఆనాటి చైనా పరిస్థితులను మోటూరు హనుమంతరావు వివరిస్తూ ఇలా రాశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, సాత్విక ఉద్యమాల ప్రజ్వలనకు అవకాశం లేని పరిస్థితుల్లో చైనా విప్లవకారులకు అనివార్యంగా సాయుధపోరాటమే శరణ్యమైంది. అదే ఎర్రసేన ఆవిర్భావానికి కారణం అయింది. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రజ్వరిల్లిన వ్యవసాయ విప్లవ కేంద్రాన్ని తుడిచి పెట్టేందుకు లక్షలాది సేనలను సమీకరించి చియాంగ్‌కైషేక్ అయిదు సార్లు దండయాత్రలు జరిపారు. ఆ దాడులన్నింటినీ ఎర్రసేన తిప్పికొట్టింది. ఆ సమయాన్ని అదునుగా తీసుకొని జపాన్ సామ్రాజ్యవాద ముష్కరులు మంచురియాను ముట్టడించి దురాక్రమణకు పూనుకొన్నారు. ఇటు చియాంగ్‌కైషేక్ దాడుల నుండి వ్యవసాయ విప్లవ పోరాటాన్ని సంరక్షించుకోవాలి. అటు జపాన్ సామ్రాజ్యవాదుల నుండి దేశాన్ని రక్షించుకోవాలి. స్వాతంత్ర్యాన్ని సంరక్షించుకోవడం, వ్యవసాయ విప్లవం ద్వారా సోషలిజాన్ని సాధించుకోవడం అన్న ద్విముఖ కర్తవ్యాల సాధన, సమన్వయాల మేలు కలయికే మావో ఆలోచన విధానం. మార్క్సిజం లెనినిజాన్ని దేశ కాల పరిస్థితులకు అన్వయించిన ఈ మార్గాన్నే చైనా కమ్యూనిస్టు పార్టీ చేపట్టింది. ఆ కర్తవ్య నిర్వహణకే కామ్రేడ్స్ మావో, చూటే, చౌఎన్‌లైల నాయకత్వాన ఆరు వేల మైళ్ల లాంగ్ మార్చ్‌ని ఎర్రసేన తలపెట్టింది. దక్షిణాది నుండి ఉత్తరాదికి మూడు లక్షల మంది సేన ఆ బాల గోపాలంతో సహా తరలిపోయిన యాత్రను మహాప్రస్థానం"గా అభివర్ణించారు. ఆ మహాప్రస్థానానికి సాహసించి సారధ్యం వహించిన యోధుల, మహాయోధుల విరోచితగాథలను జీవిత విశేషాలను వారితో ఇంటర్వ్యూ చేసి ఎడ్గార్ స్నో సమీకరించిన సమాచార దీపిక 'చైనాపై అరుణ తార'. ఎడ్గార్ స్నో జీవిత విశేషాల గురించి రాసి పుస్తకంలో పొందుపరిచారు వి.ఆర్ బొమ్మారెడ్డి. సామ్రాజ్యవాదుల ఆధిపత్యాన్ని స్వదేశంలోని ఫ్యూడల్ నిరంకుశ పాలకులను ఎదిరించి కొన్ని ప్రాంతాలను విముక్తి చేసిన చైనా కమ్యూనిస్టు పార్టీనీ, నాయకులను బందిపోట్లుగా పెట్టుబడిదారీ పత్రికలన్నీ తప్పుడు ప్రచారం చేస్తున్న దశలో స్నో యువ పాత్రికేయుడిగా చైనా వెళ్లి తాను చూసిన వాస్తవాలను ప్రపంచానికి చాటారు. ఆ పోరాటానికి దానికి నాయకత్వం వహిస్తున్న మావో విశిష్టతను ఆయన తొలిసారిగా వెలుగులోకి తెచ్చారు. న్యూయార్క్ నగరంలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో స్నో జర్నలిజం కోర్సు చేశాను. 22 ఏళ్ల వయస్సులో ఎడ్గార్ స్నో 1925లో దూరప్రాచ్యదేశాల విశేషాలను అమెరికన్ పత్రికలకు రిపోర్టు చేసేందుకు చైనా వెళ్లారు. ఆరునెలలు మాత్రమే అక్కడ ఉండాలని మొదట అనుకొన్నారు. కాని 13 ఏళ్ల పాటు అక్కడే ఉండిపోయాడు. 1930లో చైనాలోని ఎర్రసైన్యం తన చారిత్రాత్మక మహాప్రస్థానాన్ని ముగించుకొని ఉత్తరాన యానాన్‌లో కమ్యూనిస్టు పార్టీ స్థావరం ఏర్పరచుకోగలిగింది. కొమింటాగ్ మూకల నుండి తప్పించుకొని ఆ ప్రాంతానికి చేరడం ఎవరికి సాధ్యం అయ్యేది కాదు. కనుక అక్కడి విషయాలు ఎవరికీ తెలిసేవి కావు. అలాంటి పరిస్థితుల్లో స్నో కొమింటాగ్ సైనిక దిగ్బంధనం నుండి తప్పించుకొని కమ్యూనిస్టుల స్థావరాలను చేరుకోగలిగారు. అక్కడే ఆ నాలుగు మాసాలుండి పోరాటానికి, కమ్యూనిస్టు కార్యకలాపాలకు సంబంధించిన అనేక విషయాలు సేకరించారు. మావో, చౌఎన్‌లై, చూటే వంటి నాయకులను ఇంటర్వ్యూ చేశారు. తాను సేకరించిన అపారమైన సమాచారంతో ఫోటోలతో బీజింగ్‌కు తిరిగొచ్చి వాటిని అమెరికన్, బ్రిటన్ పత్రికలకు పంపించడం ప్రారంభించాడు. 1937లో లండన్‌లోని వామపక్ష ప్రచురణాలయం గొల్లెంజి ఆ రిపోర్టులను 'రెడ్‌స్టార్ ఓవర్ చైనా' పేరుతో ఒక పుస్తకంగా ప్రచురించింది. పుస్తకం ఎంత ఆసక్తి కల్గించిందంటే ఒక నెలలోనే ఐదుసార్లు ముద్రించాడు. కొద్దివారాల కాలంలోనే లక్షగ్రంథాలు అమ్ముడుపోయాయి. ఈ గ్రంథం ప్రచురణ తర్వాత స్నో కొమింటాగ్ పాలకుల తీవ్ర నిర్బంధానికి గురయ్యారు. ఇక అక్కడ ఉండలేని స్థితిలో 1941లో చైనా వదిలి వచ్చేశాడు. 1972లో ఎడ్గార్ స్నో ఆరోగ్యం క్లిష్టంగా తయారైనప్పుడు మావో, చౌఎన్‌లైలు చైనా డాక్టర్లతో, నర్సులతో కూడిన ఒక బృందాన్ని స్నో నివసిస్తున్న స్విట్జర్లాండ్‌కు పంపారు. ఆ బృందానికి ఆ నాటి ఉపప్రధాని, విదేశాంగ మంత్రి హెవాంగ్ మావో నాయకత్వం వహించారు. దాన్నిబట్టి చైనా కమ్యూనిస్టు పార్టీ, స్నోకు ఇచ్చిన ప్రాధాన్యత ఏమిటో అర్థమవుతుంది. 1979లో ఈ గ్రంథం చైనా భాషలో ప్రచురితమైంది. కోటి 60 లక్షల ప్రతులు అమ్ముడుపోయాయి.

చైనా కమ్యూనిస్టుల గురించి రిపోర్టు చేయడానికి ముందు వాయువ్య ప్రాంతంలోని కరువు జిల్లాల్లో స్నో పర్యటించారు. చైనా మేధావులూ, రచయితలూ అనేక మందిని కలుసుకున్నారు. మదామ్ సన్‌ఎట్‌సేన్‌కు మిత్రుడయ్యారు. ఆమె ఇచ్చిన పరిచయ పత్రం తీసుకొని కమ్యూనిస్టులను కలిసేందుకు బయల్దేరారు. ఆయన గురించి మావో ఇలా చెప్పారు "ఎవరూ రాలేని పరిస్థితుల్లో ఎడ్గార్ స్నో చైనా రాగలిగారు. ఆయన ఇక్కడ పరిస్థితులను అధ్యయనం చేశాడు. మా గురించిన వాస్తవాలను ప్రపంచం తెలుసుకునేందకు ఆయన సాయపడ్డారు. ఆ విధంగా మా దేశానికి ఆయన చేసిన సేవను మేము ఎల్లప్పుడూ స్మరించుకొంటాం".

ఒక జర్నలిస్టుగా సమకాలీన ధోరణులను మదింపు చేయగల, అమెరికాలోని ప్రజలకు వాటిని స్పష్టంగా వివరించగల దీక్షగల రిపోర్టర్‌గా తనను తాను నిరూపించుకొన్నారు స్నో. చైనాపై జపాన్ చేసిన దురాక్రమణ మీద "దూరప్రాచ్య యుద్ధ రంగం" పేరుతో మరో పుస్తకం ప్రచురించారాయన. 'చైనాపై అరుణతార' పుస్తకంలో కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి గల అవకాశాన్ని అంచనా వేసి చెప్పారు. ఆయన చెప్పినట్లుగానే కమ్యూనిస్టు పార్టీ విజయం సాధించింది. నాయకుల నుండి కార్యకర్తల నుండి సేకరించిన వివరాలతో 600 పేజీలు సాగే మహాగ్రంథం 'చైనాపై అరుణతార'. ఇంటర్వ్యూల్లో నాయకులు, కార్యకర్తలు వివరించిన సంఘటనలను జాగ్రత్తగా నోట్ చేసుకొని, వాస్తవాలకు విఘాతం కలుగకుండా వాటిని ఆసక్తి కరమైన రిపోర్టులుగా మలిచి పాఠకులకు సమగ్రంగా అందించారు ఎడ్గార్ స్నో.

జర్నలిస్టులు తమ వృత్తిలో పాటించాల్సిన ఉత్తమ ప్రమాణాలను స్నో సల్పిన కృషిని ఆయన రిపోర్టులు తెలియచేస్తాయి. ఏ విధంగా చూసుకొన్నా జర్నలిస్టులకు ఆ గ్రంథం శిరోధార్యం. చైనా కమ్యూనిస్టు పార్టీ విజయవంతంగా నిర్వహించిన మహా ప్రస్థానం గురించి తెలుసుకోవడానికి ఎవరికైనా చక్కటి మార్గం. ★

సూక్ష్మ రుణం



బతుకు భారమైంది
బతకడమే నేరమైంది
ప్రతినిత్యం సెల్లుతో సొల్లు
టీవీతో కరెంటు బిల్లు
ప్రయాణంతో ఖర్చులు జోరు,
చుట్టాలతో వంటిల్లు ఖాళీ
చదువులకు ఫీజు రసీదు రోజు
మరి మైక్రోఫైనాన్స్ దారి
ప్రతి రోజు కూలీ నాలీ చేసి
డబ్బులడిగితే నెలలకొద్ది వాయిదా
ఫస్ట్‌కే వడ్డీ కట్టాలని మైక్రో వాదనా
నేనిస్తా రమ్మంటూ ఫైనాన్స్‌ల పిలుపు
ఆలి పుస్తె తాకట్టుతో మైక్రో నెల గడిచె...!!
కూలి డబ్బులేమో
సెల్, విందులకు ఖర్చాయే
వడ్డీ మీద వడ్డీ చక్రవడ్డీ లెక్కజేసి
మైక్రో, ఫైనాన్స్ వారు బజారుకీడ్చె...?
ఆలి పుస్తె అమ్మితే వడ్డి తీరపాయె
గూడు అమ్మినా సగం అప్పు తొలగకపాయే,
హైటెక్ హంగులకు పోతే
చివరకూ ప్రాణం మీదికి వచ్చే
అందుకే నేడు ప్రజల బతుకు భారమైంది.
బతకడమే నేరమైంది
ఆలోచించండి
అప్పు చేయకండి ...!

- ఉండ్రాల రాజేశం

కవిత్వమ్

అన్నదాత ఆకలికేకలు

నెర్రెలిచ్చిన నేలమ్మ
ఆశగా ఆకాశంకేసి మోరెత్తితే
నీలి మబ్బుల్ని చీల్చుకుంటూ వర్షించిన వాన!
అద్భుతాలింగన స్పర్శతో నేలను చేరి
రైతన్న హృదిలో ప్రభవించిన
ఆశల విత్తుల్ని చిగురింపజేసి
పసిడి పైరుని ముంగిలి చేరుస్తుందని తలిస్తే...
తలవని తలంపుగా తరలివచ్చిన వాన ఉధృత
రూపందాల్చి
తలకు మించిన భారాన్ని రైతుపై మోపితే
పసిడిరాశుల్ని పండించిన మాగాణి
ఏగానికీ కొరగాక...
గిట్టుబాటు లేని గింజలతో
కాళ్లను చుట్టుకున్న అప్పులతో
బతుకు బంకమన్నులా సాగుతుంటే
దారిద్ర్యం దూరపుబంధువులా దరి చేరుతుంటే
ఆకలి తీర్చే అన్నదాతే ఆకలికేకలు పెడుతుంటె
ఆదుకోవాల్సిన ఆపన్న హస్తం అలక్ష్యం చేస్తుంటే
మట్టిని నమ్ముకున్నోడికి మనుగడ కష్టమే!

-ఇల్ల ప్రసన్నలక్ష్మి

కవిత్వమ్

మౌనం మాట్లాడుతోంది....

మౌనం మాట్లాడుతోంది
మానవత్వం మట్టి కలిసినపుడు
మనిషితో మనిషి కరచాలనం
గతకాలపు వైభవం మాత్రమే!

రెండు రక్తపు చుక్కలు
చిందించి ఎంతమంది
నల్లవాళ్లు వారి శరీరాన్ని
కళేబరాల్ని చేసుకున్నారో!

నా అస్తిత్వం మాయమై
ఆకాశం వరకు చిమ్మిన
చెమట చుక్కలు
ఇపుడు వర్షమై మీ దాహాన్ని
తీర్చుతున్నాయి!

చిన్నప్పుడు చెప్పిన
చందమామ కథ
పగిలిన గాజు పెంకుల్లా



చెల్లా చెదురుగా పడిన శకలాల్లా
తోస్తున్నాయి!

చరిత్ర ఎప్పుడూ పునరావృత్తం
అవుతుంది
ఒంటరి సమూహంతో ఉన్నప్పుడు
రాత్రిళ్లు పేలిన బాంబుల శబ్దాల్లా!

అనుమానపు చూపులతో
దేహాలను ఎక్సరే తీస్తున్నారు
రక్త మాంసాలతో పాటు కాసింత
మానవత్వపు రేఖలు అస్పష్టంగా
కనిపిస్తున్నాయి!

ఆకాశమే హద్దుగా
కంఠమెత్తి విలపిస్తున్నా
మారణహోమానికి వ్యతిరేకంగా!

చిప్పున చిందిన నెత్తురు మరకల
సాక్షిగా మీ నెత్తురు వృథా పోదని
అభయ హస్తం ఇస్తున్నా!

- వెంకటేష్

వెల కట్టలేని సంపుటం

గుండె గొంతుకలో కొట్టుకులాడిన అనుభవం... సూటిగా గుండెల్లో గుచ్చుకున్న అనుభూతి... ఇంకిపోయిన భావనలు తట్టిలేపిన భావన... హృదయమంతా ఆర్తి నిండిన ఆవేదన... ఈ కథల సంపుటం చదివాక కలిగే అనుభూతులు. రొటీన్‌గా రోజులు గడిపేస్తున్న మనల్లో, మన మదిలో ఇలాంటి భావనలు కలగజేయడం కేవలం పెద్దిభొట్ల వారికే సొంతం. కథ మనల్నింతగా మైమరపింపజేస్తుందా? ఇహలోకాన్ని వీడి పరధ్యానంలో ముంచేస్తుందా? ఇంకిపోయిన భావాలు చెమ్మగిల్లజేస్తుందా? అప్పుడెప్పుడో అక్కడక్కడా చదివిన కథలు నేడు గుత్తిగా కనపడితే చదవకుండా ఆగలేం. చదివి అలజడికి లోనుకాకుండానూ వుండలేం. ఆనందం, ఆక్రోశం, ఆహ్లాదం, ఆవేదన... ఇలాంటి చిక్కని భావనలన్నీ ఇంత చిన్న కథల్లో జొప్పించడం ఎలా సాధ్యం? ఎలాగంటే ఇవి పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారి కథలు. మధ్యతరగతి మనుషుల్లో తారాట్లాడే దోబూచులన్నింటినీ ఆట్టే హంగానూ లేకుండా సరైన సమతూకం చేసి అక్షరాలుగా పరవడం పెద్దిభొట్లవారికే సాధ్యమేమో! జీవితాన్ని కాచి వడపోయగా వచ్చిన సారాన్ని కథల్లో ఇమిడ్చిన గొప్పదనం... ఇది తెలుగు భాషకు దక్కిన గౌరవం. ఆనాటి సాహిత్య విలువలను అర్థం చేసుకుని... నేర్చుకోవాల్సిన ఆవశ్యకత మనపై వుంది. అందుకు ఇలాంటి కథలే మార్గాలు. ఇందులోనివన్నీ మరపురాని కథలు... గుర్తుంచుకోదగిన జీవిత పాఠాలు. 'పేరయ్య బావి' గుండె చెమర్చే కథ. 'మిస్ భారతి బిఎ' కట్నరక్కసి కోరల్లో నలుగుతున్న కోమలాంగుల మనోవ్యథకు కథారూపం. 'వన్‌వే ట్రాఫిక్' గతాన్ని తవ్వి తోడుకోవాలనుకున్న వృద్ధుని ఆత్మఘోష. 'భయం' కథలో చిన్నారి చిరంజీవి అమాయకత్వం, తల్లి కోపం మటుమాయం చేయాలనే తాపత్రయం మనసును నులివెచ్చగా హత్తుకుంటుంది. నీటి ఎద్దడి తాలూకు ఆవేదన మనసుకు అవగతమయ్యే కథ 'నీళ్లు'. మారుతున్న విలువలు, అందులోని డొల్లతనానికి అద్దంపట్టే కథ 'రాళ్లూ– రత్నాలూ'. వృద్ధాప్యంలో అవసరమయ్యే ఆసరాకు నిలువుటద్దం 'మనసు' కథ. 'మబ్బు వీడని ఎండ' వున్నట్లుండి స్నేహితుని మరణాన్ని జీర్ణించుకోలేని వృద్ధుని అలజడికి దర్పణం. కాల్పనిక ప్రపంచంలో నెట్టుకురాలేని... వాస్తవికతను వీడలేని ఒక రచయిత ఊగిసలాట 'పుట్ట' కథ. చీకటి బతుకుల రసహీన జీవితపు ఛాయలు 'చీకటి' కథ. ఇంకిపోతున్న మానవ సంబంధాల మధ్య నిలువెత్తు నిజాయితీకి దర్పణం 'ముసురు'. ఆకలి కేకలు గింగురుమంటూ మారుమోగే కథ 'నిప్పుకోడి'. సినీరంగపు రంగు వెలసిన చిత్రం 'ఎక్స్‌ట్రా' కథ. 'కళ్లజోడు', 'కోరిక' కథలు జీవితపు చివరి అంకంలోని మానసిక సంఘర్షణలకు ప్రతిరూపాలు. 'భ్రమ' కథలో వేదమ్మ మన మనసులోంచి ఓ పట్టాన బైటికెళ్లదు. కథలన్నీ గుండెను తడిమేవే! అంటే తప్పనిసరిగా చదవాల్సినవే!!

పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథలు(మొదటి సంపుటం), పేజీలు:297, వెల: 160/-, ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్.

- కె. అరుణ

కొత్త పుస్తకాలు

శేషేంద్ర తెలుగు సాహిత్య వ్యాసావళి

శేషేంద్ర గొప్ప పండితకవి. ప్రాచీన సాహిత్యాన్ని తైపారు వేసిన ప్రతిభా సంపన్నుడు. సంస్కృతాంధ్ర ఆంగ్ల భాషాసాహిత్యాల్లో విశేష ప్రజ్ఞగల సాహిత్య విమర్శకుడు. పౌరవ్యవహార పరిపాలన వృత్తి అయినా సాహిత్యతత్వ సమాలోచనం ప్రవృత్తిగా ప్రవర్ధమానమైన వాడు. శేషేంద్ర తెలుగు సాహిత్య వ్యాసావళి 'సాహిత్య కౌముది'ని ఈ తరం పాఠకులకు సాత్యకి గ్రంథరూపంలో అందిస్తూ ఆచార్యననుమాస స్వామి, దిలావర్, డా॥ముక్తేవి భారతి, గొల్లపూడి మారుతీరావు ప్రభృతులు శేషేంద్రపై రాసిన వ్యాసాలను, వీక్షణవారి సంస్మరణనూ ఇందులో చేర్చారు. పుస్తకం ఎక్కువ పేజీలతో కొంచెం చేతికి ఆనాలని ఆపని చేశారేమో! శేషేంద్ర రాసిన శ్రీనాథావతార తత్వము, ఛందస్సుకు, అలంకార శాస్త్రానికి ఒక సేతువుగా పద్యశిల్ప శాస్త్రం నిర్మించాలి, రెండవ కవిత్రయము పూర్వకవుల పరస్పర సంబంధములు, శివకవులు, హరిహర కవులు, తిక్కన సోమయాజి ఏకైక ధ్వని కావ్య ప్రణేత, ఆంధ్ర సాహిత్యంలో హాస్యరసం, మంచిపుస్తకాలు, కన్నడ వాఙ్మయంలో వింతలూ విశేషాలు, విశ్వసాహిత్యంలో కన్యాశుల్కం వంటి వ్యాసాలున్నాయి ఇందులో. శేషేంద్ర రెండవ కవిత్రయంగా పేర్కొన్నది జక్కన, శ్రీనాథుడు, పిల్లలమర్రి పినవీరభద్రుడు. ఆయనే మూడవ కవిత్రయంగా అల్లసాని పెద్దన, తెనాలి రామకృష్ణుడు, రామరాజభూషణుడని పేర్కొన్నారు (తిక్కన, వేమన, గురజాడ తెలుగువారి అసలైన కవిత్రయం అన్న శ్రీశ్రీ కూడా ఇక్కడ గుర్తుకు వస్తున్నాడు). శేషేంద్ర శ్రీనాథుని పక్షపాతిగా తోస్తాడు. శ్రీనాథుడు ఆంధ్రసాహిత్యలోకంలో జగన్మోహిని అవతారం అనీ, ఆ మహామాయకు బద్ధులు గానివారు లేరనీ అంటారు శేషేంద్ర. శ్రీనాథావతారతత్వము వ్యాసం ఒక్కటి చాలు శేషేంద్ర విషయవిమర్శనా పరిజ్ఞానాన్ని అర్థం చేసుకోడానికి. శేషేంద్ర ప్రచురణలకు కాపీరైట్స్ హక్కు తనదేనని సాత్యకి డాక్యుమెంట్స్‌తో మళ్లీ మరో మారు ఈ గ్రంథంలోనూ చివర అనివార్యంగా కనబడతారు. ప్రచురణకర్తల చిరునామా మాత్రం గ్రంథంలో లేదెందుకోమరి!

-సుధామ

సాహిత్య కౌముది (తెలుగు సాహిత్య వ్యాసావళి) -శేషేంద్ర-గుంటూరు శేషేంద్రశర్మ మెమోరియల్ ట్రస్ట్, హైదరాబాద్, వెల-100రూ.

వామపక్ష ఉద్యమ సాహితీ వారసత్వం నూరేళ్ళ పులుపుల కామ్రేడ్ పులుపుల వెంకటశివయ్య జీవితం - కృషి పెనుగొండ లక్ష్మీనారాయణ వెల:40/-, పేజీలు :81 ప్రతులకు : విశాలాంధ్ర అన్ని బుక్ షాపులు



పిచ్చుక గూళ్లు కథలు శ్రీలత వెల: 60/-, పేజీలు :139 ప్రతులకు : విశాలాంధ్ర అన్ని బుక్ షాపులు

సీరియల్



జరిగినకథ:

ట్రాయ్‌ను చూడ్డానికి జైలుకు వెళ్లిన కుయేన్‌తో తనకోసం వచ్చేటప్పుడు భోజనం కోసం అంత డబ్బు ఖర్చు చేయొద్దని చెప్తాడు. పైగా అమెరికన్ ముష్కరులను సంహరించే కార్యక్రమం పూర్తి చేశాక ... కుయేన్‌ను కూడా మంచి కార్యకర్తగా తయారు చేయాలనుకొన్న విషయం చెప్తాడు. ట్రాయ్‌తో విద్యుత్ సమ్మె గురించి చెప్తుంది కుయేన్. అతను ఆ విషయం వినడంతోటే ఎంతో సంతోషిస్తాడు. తను యువజన సంఘంలో చేరినప్పుడు రాజకీయ తరగతుల గురించి చెప్తాడు.

ఆ తర్వాత...

వియత్నాం వీరుడు ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్

కథనం: ఫాన్-థి-కుయేన్

అనువాదం: పాటూరి రామయ్య

(పద్నాలుగో భాగం)

'విద్యుత్ కార్మికులు ఒక్కరోజు పని ఆపితే పట్టణమంతా గాఢాంధకారంలో చీకట్లో మునిగిపోతుంది. ఆ దురాక్రమణదార్ల మురాకంతటికీ బ్యాటరీ లైట్లు చేతుల్లోకి వస్తాయి. ఎలక్ట్రికల్ జనరేటర్ల గురించి వాళ్ళకేమి తెలుసు?'

'ఆయన చెప్పేదంతా వింటూ నేను మరింత ముగ్ధురాలినైపోయాను.

'తమ శక్తిని శత్రువుకు నిరూపించేందుకు కార్మికులందరూ అలా పనులు మానివేశారు. నాకైతే నేను పరిస్థితిని అంచనా కట్టలేకపోయాను. కాని జైల్లో నీరు, కరెంటు సరఫరా ఆగిపోయింది. మరుసటిరోజు ఇలా వార్తలందాయి. సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ఫలితంగా రవాణా, మార్కెట్లు అన్నీ బంద్ అయిపోయాయి. పట్టణ ప్రజా జీవితమే స్తంభించిపోయింది.

'మా ఉత్సాహానికి అంతంటూ లేదు. శిక్షితుల వార్డు అంతా విప్లవగీతాలు, పద్యాలతో ప్రతిధ్వనించింది. కాపలావాళ్ళు వచ్చి మమ్మల్ని తోస్తూ లాఠీలతో మోదారు. అంతమాత్రాన మేము పాడుకోవడం మానలేదు. ఒకవేళ మేము మరణించినా వాళ్ళను మట్టుబెట్టడానికి ఉరకలు వేస్తున్న బ్రహ్మాండమైన ప్రజాశక్తి ఎలాంటిదో మేము తెలుసుకున్నాం.'

ఒక పోలీసువాడు మేజా ముందు కూర్చుని ఒక పత్రికలోకి చూస్తూ వాగుతున్నాడు.

నేను వెంటనే సంచి తెరచి దుస్తులు బైటకు తీశాను. ఎంబ్రాయిడరీ అల్లిన జేబు రుమాలు వాటి మధ్యన వుంది. ఆ రుమాలు తీసి నా అరచేతిలో పెట్టి గట్టిగా పొరవిప్పాను.

ఆతృతతో నేనిలా చెప్పాను.

'నీ కోసమే ఇవన్నీ తెచ్చాను. కొట్లోకి వెళ్ళిన తర్వాత మళ్ళీ ఒకసారి పరికించి చూడు'

'వాళ్ళు చూస్తారుగా'

ఆ బట్టల మడత విప్పుతూ, మడుస్తూ వుండిపోయాను. మా వైపు నిఘా పెట్టి చూస్తోన్న పోలీసు వాణ్ణి మళ్ళించడానికి అలా చేశాను. వాడు మాపైన నిఘా తప్పించిన తరువాత ఆయనకు జేబు రుమాలు చూపించి ఇలా అడిగాను.

'దీన్ని నీవు తీసుకెళ్ళగలవా?'

దాని మీద ఒక పాటను ఎర్రని దారంతో కుట్టాను. ట్రాయ్ ఆశ్చర్యానికి అంతులేదు.

'అబ్బ! దేవుడా! ఈ ఎంబ్రాయిడరీ అల్లిందెవరూ?' అడిగాడు.

ఆ ప్రశ్న అడిగీ అడగడంతో అమితమైన సంతోషంతో మురిసిపోయాను. ఆ ప్రశ్న ఎప్పుడెప్పుడు అడుగుతాడా అని ఎదురు చూశాను.

"నేను – నేనే అల్లాను. జైల్లో నా సహచారిణులు నేర్పించారు.'

ట్రాయ్ ముఖంలో ఆశ్చర్యం తగ్గిపోయింది గాని తృప్తిగా కనపడ్డాడు.

'నీవు చాలా విచిత్రమైన గృహిణివి.' నవ్వుతూ ఇంకా ఇలా అన్నాడు!'

'నీ జైలు జీవితం కొద్ది మాసాలు మాత్రమే అయినప్పటికీ అవసరమైన చాలా విషయాలు నేర్చుకున్నావు. చాలా మంచిది.

ఇంతకుముందు కొట్లో వున్నప్పుడు నేనీ పాటను రాశాను. దీన్ని నా సహచరులతో కంఠస్థం చేయిస్తున్నాను. దీన్ని ఎవ్వరికీ కనపడకుండా ఇంటికి తీసుకెళ్ళు. పోలీసులు చూశారా చితగ్గొట్టేస్తారు.'

దిండు కవర్ల మీద పువ్వుల అల్లకం కూడా నేర్పించారు. ఇదిగో ఇవి చూడు. మన పెళ్ళికి తెచ్చుకున్న వాటికంటే ఎంత చక్కగా ఉన్నాయ్. వీటిని మనకు పెళ్ళి కానుకలుగా ఇచ్చారు వాళ్ళు" అన్నాను.

"వాళ్ళు నీకు చాలా పాటలు కూడా నేర్పించారా?'

'అవును నిజంగా నేర్పించారు. ఈ దుస్తులు మా పోరాట వీరులకోసం హియన్‌లూవాగ్ వారధి, ఆశాగీతం, కమ్యూనిస్టు శక్తే మనదేశం, కమ్యూనిస్టు వాహిని... ఇలా అనేకం నేర్పించారు. మరణ శిక్షితుని గీతాలాపం, పదండి ముందుకు.....,

ప్రతిపాట, పద్యం పేర్లను మళ్ళీ మళ్ళీ మననం చేసుకున్నాడు. తర్వాత ఇలా అన్నాడు : 'నీవు కూడా కమ్యూనిస్టు పాటలు నేర్చుకున్నావా?

అవును. ఒక శ్రమజీవిగా నీవు ఆ పాటలు తప్పకుండా నేర్చుకోవాలి. మనం కమ్యూనిస్టు సమాజం నిర్మించుకున్నప్పుడు ప్రతి ఒక్కరం సుఖ సంతోషాలతో మనగలుగుతాం. ప్రతివాడు తన శ్రమ ఫలితాన్ని అనుభవించగలడు. ఎవ్వరుగూడ నిష్ఠదరిద్రం అనుభవించడానికి అవకాశం ఉండదని మా నాయకులు చెప్పారు. ఉత్తర వియత్నాం ఈ మార్గంలోనే అభ్యుదయానికి పయనిస్తోంది. నేనొక్కణ్ణి లేకపోయినప్పటికీ అభ్యుదయం సాధించేందుకు ప్రతివారు కమ్యూనిస్టుగా పోరాడాలన్నదే నా ప్రగాఢ వాంఛ.'

నాకు అది సరిగా గుర్తు లేదు. నేనిప్పుడు రాయలేను కూడా. నా సహ ఖైదీ ఒకతను మాకు పాటలు నేర్పించిన నేరానికి కర్కశంగా హింసించబడ్డాడు. అలా నేర్పడం మానేయమని మేము చెప్పినప్పుడు నిరాకరించి ఇలా చెప్పేవాడు.

జైల్లో పాటలు నేర్పడం గూడా ఒక విప్లవ చర్యే. అలా పాటలు నేర్చుకోవడం వల్ల భవిష్యత్తు మీద నమ్మకం, ఆత్మ విశ్వాసం కలుగుతుంది.'

'నీవు తల మునకలుగా కష్టాల్లో ఉన్నప్పుడు ఈ చరణాలు పాడుకుంటావని ఆశిస్తాను. మన సహ ఖైదీలు మనలను అపారంగా ప్రేమిస్తారు. మనందరిదీ ఒకే సిద్ధాంతం కాబట్టి పరస్పరం గౌరవించుకుందాం. వాళ్ళ అడుగుజాడల్లో నడవడానికి ప్రయత్నించాలి. నేను నీతో ఉన్నా లేకపోయినా వాళ్ళ మాదిరి ధైర్యంగా జీవించాలి. ఆత్మ విశ్వాసం ఉండాలి. వాళ్ళవలె విప్లవం కోసం బతకాలి.

'వాళ్ళ నెవరినైనా చూసినప్పుడు నా విప్లవాభివందనాలు తెలియజేయి. విప్లవ పాఠాలు చెప్పి నీలో విప్లవ చైతన్యం కలిగించిన వారికి గూడ నా కృతజ్ఞతలు అందించు. ఊఁ!'

కొంతసేపు నిశ్శబ్దం, మరో విషయం చెప్పడానికి ప్రయత్నించాడు. నాతల కురుల మధ్య వేళ్ళు దూర్చి ఊపుతూ, ఊరడించుతూ ఇలా అన్నాడు :

'ఇదిగో! ఏడుస్తున్నావ్! వద్దు. అలా ఏడవకూడదు. బాధలు, కష్టాలను జయించడం నేర్చుకోవాలి. జనరల్ పోలీసు డిపార్టుమెంటుకు చెందిన జైల్లో ఉన్నప్పుడు నీ సహ ఖైదీలను నాకు ఏమని చెప్పమన్నారో ఒకసారి జ్ఞాపకం చేసుకో. 'అంతా సంతోషంగా ఉన్నాం. అందరం కలిసి ఉత్సాహంగా పాటలు పాడుకుంటూ ఉన్నాం.' అని చెప్పావు కదూ?'

నా కళ్ళలోకి చూస్తూ చిరునవ్వు నవ్వాడు. తనంతట తాను సంతోషంగా ఉండటానికి ప్రయత్నిస్తోన్నట్లు నాకు తోచింది. కానీ ఆయన కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

ఎప్పుడెప్పుడో జరగబోయే భవిష్యత్తును గురించి చెప్పుకుపోతున్నాడు. తాను బతికి వున్నా లేక మరణించినా బాధపడవద్దని నన్ను కోరనుగూడ లేదు.

చిన్నారి క్యాన్‌తో కొంచెంసేపు ఆడుకున్నాడు. విడుదలై ఇంటికి వచ్చినప్పుడు ఓడరేవు దగ్గర పార్కుకి తీసుకెడతానని, బిస్కెట్లు అవీ కొనిపెడ్తానని క్యాన్‌కు ఒట్టేసుకున్నాడు. (మా పెళ్ళయిం తర్వాత ఒకసారి చిన్నారి క్యాన్‌తో కలిసి ఆ పార్కుకెళ్ళాం.)

జ్ఞాపకార్థంగా తన ఫిడేలును జాగ్రత్తగా దాచి ఉంచమని అడిగాడు ట్రాయ్. పండువెన్నెల రాత్రిళ్ళలోను, ఇరుగుపొరుగు పిల్లలు వచ్చి పాడుకునేందుకు దాన్ని ఉపయోగించమని కోరాడు.

"ఇదంతా ఒట్టి బెదిరింపులు. ఈ ఉరి శిక్షలు అమలు పర్చడానికి ప్రభుత్వానికి (కీలుబొమ్మ) ధైర్యం చాలదని ఇక్కడ మా పెద్ద వాళ్ళు అనుకుంటున్నారు. అందువల్ల నువ్వేమి చింతించకు. నీ అంతట నువ్వు ధైర్యంగా, నెమ్మదిగా ఉండు"

ఆయన్ను విడిచి వచ్చేందుకు టైం కావస్తోంది. అప్పుడిలా అన్నాడు :

"వచ్చే అక్టోబరు 15వ తేదీ బహుశా పొట్లాలు వగైరా పంపేందుకు మాత్రమే అనుమతించవచ్చు. నన్ను చూడ్డానికి మాత్రం అనుమతించరు. ఏదో విధంగా ఉత్తరం పంపవూ? నీ లేఖకోసం ఎదురు చూస్తుంటాను.'

అది ఆగష్టు 8వ తేదీ, వచ్చే వారంలోనే ట్రాయ్‌ని ఉరిదీస్తారని సైగాన్ పత్రికలన్నీ ప్రకటించాయి. ఇది భయంకరమైన వార్తే. ఈ వార్తను పత్రికలమ్మే కుర్రవాడు నాకు తెలియచేశాడు. ఆ కుర్రవాని ముఖంలో విషాదంతో బాటు ఆవేశం నిండిపోయింది.

ఈ వార్తను హాన్‌డాంగ్ పత్రిక మొట్టమొదటి పేజీలో ప్రకటించింది. ఈ పంక్తులు బాక్సుకట్టి ప్రత్యేకంగా మరీ ప్రకటించారు. 'బహిరంగ ఉరితీతలు, మే మాసంలో కాంగ్లీ బ్రిడ్జి కింద మందుగని నాటినవాడు మొట్టమొదట కాల్చి చంపబడతాడు.'

అమెరికా-ఖాన్ ముఠా వ్యతిరేకోద్యమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు, బహిరంగ సభలు, ప్రదర్శనలు, సమ్మెలు జరిపిన వారు ఏదో ఒక సంఖ్యలో కాల్చి చంపబడతారని కొన్ని పత్రికలు స్పష్టంగానే ప్రకటించాయి.

సెలవు కోసం మా కంపెనీకి ఆతృతతో వెళ్ళాను. ట్రాయ్‌ని చివరిసారిగా చూచే అవకాశం నాకిదే.

వాళ్ళు నన్ను చూశారు. చాలామంది స్త్రీలు నన్ను చూచి కంటతడి పెట్టారు. సాధారణంగా ఎప్పుడూ వాగుడుకాయల్లా ఉండే నా సాహసగత్తెలు మూగవాళ్ళులా దుఃఖించారు. కంపెనీలో ఆఫీసు గదికి వెళ్తుండగా ఒకతను నా వెంట నాలుగడుగులు వేసి చెవిలో గుస గుస ఇలా అన్నాడు :

"ఇదంతా ఒట్టి బెదిరింపులు. ఈ ఉరి శిక్షలు అమలు పర్చడానికి ప్రభుత్వానికి (కీలుబొమ్మ) ధైర్యం చాలదని ఇక్కడ మా పెద్ద వాళ్ళు అనుకుంటున్నారు. అందువల్ల నువ్వేమి చింతించకు. నీ అంతట నువ్వు ధైర్యంగా, నెమ్మదిగా ఉండు"

నేను తల్లిదండ్రుల దగ్గరకెళ్ళాను. నాన్నగారు ఒకతనికి క్షౌరం చేస్తున్నాడు. నన్ను చూచి త్వరత్వరగా ముగించాడు. వెంటనే ఒక లాయరు దగ్గరకు నన్ను తీసుకెళ్ళాడు.

శిక్షితుల వార్డులో మొట్టమొదట చూచినప్పుడు ట్రాయ్ ఇలా చెప్పాడు :

'వకీలును తీసుకురావద్దు. డబ్బు దండగవుతుంది.'

నేను ఈ సంగతి బొత్తిగా మరిచిపోలేదు. ఇంకా స్పష్టంగానే జ్ఞాపకమున్నాయి ఆ మాటలు. కాని ఈ పరిస్థితుల్లో నా భర్త ఇష్టాన్ని నేను పాటించదలుచుకోలేదు. ఎట్టి క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పటికీ నా భర్తను ఏ విధంగానైనా బతికించుకోవాలి.

ఇందుకు ఎంతటి సాహసాన్నైనా ప్రదర్శించగలను. ఎంతటి మూల్యమైనా వెచ్చించగలను. పత్రికలు చూడగానే నా హృదయం అగ్నికీలల్లో కాలిపోతున్నట్లయింది.

అక్టోబరు 15వ తేదీన మరొకసారి ట్రాయ్‌ని చూడాలన్న కోరిక నన్ను వెన్నాడుతోంది. అక్టోబరు 11వ తేదీ ఆదివారం మధ్యాహ్నం వకీలు ఫీజు ఐదువేల రూపాయలు ఇచ్చి వచ్చాను. గుమ్మంలో నా చిన్ని చెల్లి అలా అరిచింది :

"టూ మరణించాడు."

దుఃఖించడం పోనిచ్చి అది వేళాకోళమాడుతోంది. నాకు చాలా కోపం వచ్చింది. నా దగ్గరకు వచ్చి వార్తా పత్రిక నొకదాన్ని నా చేతికి అందించింది.

"పత్రికల్లో ఉంది. చూడు ఇది టూ ఫోటో కదూ?"

'థియెన్ థీ' పత్రికలోని ఫోటోను చూశాను. మందుగని, దానిచుట్టూ వున్న వైరు పక్కనే నిల్చుని ఉన్నాడు ట్రాయ్ ఆ ఫోటోలో. ఆ పత్రిక ప్రధాన శీర్షిక ఇలా ఉంది :

(తరువాయి భాగం వచ్చేవారం)

మూకీల కన్నా ముందే మన సినీ బంధం

మన దేశంలో చలనచిత్ర ప్రదర్శన తొలిసారిగా ఎప్పుడు, ఎక్కడ జరిగింది? 1896 జూలై 7న, బొంబాయిలో అని మన సినిమా చరిత్ర చెబుతోంది. మరి, మొట్టమొదటి ప్రొజెక్టర్ ఎప్పుడు వచ్చింది? ఇదేం ప్రశ్న, మొదటి ప్రదర్శన జరిగినప్పడే ప్రొజెక్టర్ కూడా వచ్చిందంటారా! ఆగండి... ఆగండి. నిజానికి, బొంబాయిలోని వాట్సన్ హోటల్‌లో తొలిసారిగా విదేశీయులు వచ్చి కదిలే బొమ్మలను ప్రదర్శించడానికి కొన్నేళ్ళ ముందు నుంచే మన దేశంలో ప్రొజెక్టర్ ద్వారా చిత్రాల ప్రదర్శన జరిగేది. సినిమాలు ప్రభవించడాని కన్నా ముందు రోజుల్లోనే అదీ దేశవాళీ ప్రొజెక్టర్లతో, మన దేశీయ పురాణ గాథల ప్రదర్శనలు జరిగేవి. విశేషం ఏమిటంటే - 120 ఏళ్ళ పై చిలుకు తరువాత కూడా ఆ ప్రొజెక్టర్ ఇప్పటికీ భద్రంగా, ప్రదర్శనకు అనువైన రీతిలోనే ఉంది.

మాయ లాంతరుతో ఆర్కైవ్స్ డైరెక్టర్ విజయ్, సునీల్ పట్వర్ధన్ కుమారులు

- రెంటాల జూనియర్

నిజానికి, చిత్ర ప్రదర్శన ఇప్పటికీ అందరికీ ఆసక్తికరమైన, అబ్బురమైన విషయం. 1885లో (కొందరు 1889 అని చెబుతున్నారు) రూపుదిద్దుకున్న ఆ నూరేళ్ళ పైచిలుకు వయసు ప్రొజెక్టర్‌తో ఇప్పుడు ప్రదర్శన చేస్తే మరెంత అద్భుతంగా ఉంటుంది. మహారాష్ట్రలోని పూణేలో నెలకొన్న భారత చలనచిత్ర సంగ్రహాలయం (నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా) దేశంలోని ఆ అత్యంత పురాతన ప్రొజెక్టర్‌ను ఈ మధ్య అందరి ఎదుటా ఉంచింది. అంతేకాకుండా, మూకీ చిత్రాల కన్నా ముందు కాలంలో తయారైన ఆ ప్రొజెక్టర్‌తో దాదాపు 35 నిమిషాల పాటు చిత్ర ప్రదర్శన జరిపింది.



ఫాల్కే

దేశంలోనే అత్యంత ప్రాచీన ప్రొజెక్టర్

మహారాష్ట్రకు చెందిన మదన్‌రావ్ మాధవరావ్ పితళే, మహాదేవ్ గోపాల్ పట్వర్ధన్‌ల కృషి, ఆలోచనల ఫలితమే ఈ ప్రొజెక్టర్‌తో ప్రదర్శనలు. అప్పట్లో ఈ ప్రొజెక్టర్‌ను ఏమని పిలిచేవారో తెలుసా? 'శాంబరిక్ ఖరోలికా'! ఈ మరాఠీ భాషా పదానికి శాంబరుడనే రాక్షసుడి ఇంద్రజాలిక లాంతరు అని అర్థం. పాశ్చాత్య దేశాల్లో దీన్నే 'మాయ లాంతరు' అని కూడా పిలుస్తారు. ఇంద్రజాలిక శక్తులున్న ఓ రాక్షసుడి పేరు మీద దానికి అలా నామకరణం చేశారు. దీనితో రకరకాల చిత్రాలను చకచకా వరుసగా ప్రదర్శిస్తూ, తెరపై బొమ్మలు కదులుతున్న భావన కలిగించేవారు.

"తెరపై కదిలే బొమ్మల ప్రదర్శనైన సినిమాకు మూలం ఈ శాంబరిక్ ఖరోలికాయే" అని సినీ చరిత్రకారులు చెబుతున్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి చిత్ర ప్రొజెక్టర్ సూత్రానికి ఈ మాయ లాంతరు ప్రతిరూపం. నిజానికి, ఆధునిక స్లయిడ్ ప్రొజెక్టర్‌కు ముందస్తు రూపాలు 16వ శతాబ్దం ప్రాంతంలోనే ఇటలీలో, చైనాలో రూపుదిద్దుకున్నాయి. చీకటి, వెలుగుల అపూర్వ కళగా పేరున్న ఈ రూపం 19వ శతాబ్ది నాటికి వచ్చేసరికి సంచార ప్రదర్శనల వ్యాపారంగా వర్ధిల్లింది. బ్రిటన్‌లోని గ్రామ గ్రామాల్లో ఈ మాయ లాంతర్లు, స్లయిడ్లతో సంచార ప్రదర్శనలు జరగసాగాయి. ఆ సమయంలోనే ముంబయ్‌కి చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఇంజనీర్ మదన్‌రావ్ మాధవ్‌రావ్ పితలే మన దేశంలో తొలిసారిగా 1885/ 89లో ఈ ప్రొజెక్టర్‌ను సిద్ధం చేసుకొని, శ్రీకృష్ణజనన దృశ్యాలను స్లయిడ్లపై చిత్రించుకొని ప్రైవేటుగా ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన మిత్రుడైన మహదేవ్ గోపాల్ పట్వర్ధన్ ఈ 'మాయ లాంతరు'ను శాంభరిక్ ఖరోలికా అంటూ, ప్రదర్శనల్ని వ్యాపార స్థాయికి తీసుకువెళ్ళారు. పట్వర్ధన్, ఆయన ఇద్దరు కుమారుల ద్వారా 19వ శతాబ్దంలో ఈ ప్రొజెక్టర్, ప్రదర్శనలు దేశంలో బాగా ప్రాచుర్యం పొందాయి.

ఇప్పటికీ అపూర్వ అనుభవమే

పట్వర్ధన్ ముని మనుమడు సునీల్ ఎస్. పట్వర్ధన్ ఇటీవల పూణేలో ఈ ప్రొజెక్టర్‌తో 'మహోన్నత భారతీయ మాయ లాంతరు ప్రదర్శన'గా బాలకృష్ణుడి లీలలతో కూడిన శ్రీకృష్ణ జన్మ కథను ప్రదర్శించారు. ఇవాళ్టి చలనచిత్ర ప్రదర్శనలకు మూలంగా నిలిచి, మూకీల కన్నా ముందస్తువైన అప్పటి ప్రాథమిక సాంకేతిక సూత్రాలను చూసిన ఈ తరం సినిమా ప్రేమికులు కూడా అపూర్వ అనుభూతికి లోనయ్యారు. తెరపై చూపుతున్న బొమ్మలకు అనుగుణంగా ప్రత్యక్ష వ్యాఖ్యానం, సంభాషణలు, పాటలు, నేపథ్య సంగీతం కూడా అందించారు. బొంబాయిలోని కల్యాణ్ ప్రాంతానికి చెందిన సునీల్ కుటుంబ సంప్రదాయంలో భాగంగా ఈ కళను నేర్చుకొని, చిత్ర ప్రదర్శనలు జరుపుతున్నారు.

ఈ ప్రొజెక్టర్‌తో పట్వర్ధన్లు 1892 ఫిబ్రవరి 20న బొంబాయిలోని కల్యాణ్ ప్రాంతంలో తొలి ప్రదర్శన ఇచ్చారు. ఆ తరువాత 1918 దాకా వందలాది ప్రదర్శనలు జరిపారు. గణేశ నవరాత్రుల లాంటి ఉత్సవాల సందర్భంగా పట్వర్ధన్ కుటుంబీకులు మహారాష్ట్రలోనే కాక ఖాందేశ్, గుజరాత్, మార్వాడ్, విదర్భ, లక్నో, కర్ణాటక మొదలు మన ఆంధ్రప్రదేశ్‌కు సైతం వచ్చి ప్రదర్శనలిచ్చిన దాఖలాలున్నాయి. ఆ తరువాత రీళ్ళతో కూడిన మూకీ సినిమాల ప్రదర్శన విస్తృత ప్రాచుర్యంలోకి రావడంతో ఈ ప్రదర్శనలు క్రమంగా క్షీణించిపోయాయి.

'మాయ లాంతరు' పని తీరు

ఆకుపచ్చ రంగులోని ఈ 'మాయ లాంతరు' లోహంతోనూ, చెక్కతోనూ చేసిన ఓ పెట్టె ఆకారంలో ఉంటుంది. దాని లోపల ఓ లెన్సు (కటకం) అమర్చి

ఉంటుంది. బయటి వైపు ఓ జూమ్ లెన్సును అమరుస్తారు. దాంతో చూడడానికి ఇది ఓ ఫిల్మ్ ప్రొజెక్టర్ లాగే అనిపిస్తుంది. రంగులతో సూక్ష్మ వర్ణచిత్రాలు చిత్రించిన గాజు స్లయిడ్లను జూమ్ లెన్సుకు ముందు ఉన్న గాడిలో అమరుస్తారు. కాంతిని ప్రసరింపజేయడం ద్వారా, గాజు స్లయిడ్ల మీది బొమ్మ జూమ్ లెన్స్ సాయంతో దూరంగా తెర మీద పెద్దదిగా కనబడుతుంది. వర్ణచిత్రాలు చిత్రించి ఉన్న గాజు స్లయిడ్లను ఆ లాంతరులో చకచకా జరుపుతారు. దాంతో, తెర మీద పడుతున్న ఆ స్లయిడ్‌లలోని బొమ్మలు కదులుతున్నట్లు భ్రమ కలుగుతుంది.

సినిమా ప్రదర్శనలకు ముందరి రూపమైన ఈ 'శాంబరిక్ ఖరోలికా'లో గాజు స్లయిడ్ల మీది సూక్ష్మ వర్ణచిత్రాలు కేవలం 4 అంగుళాల పొడవు, 4 అంగుళాల వెడల్పు ఉంటాయి. వాటిని మాయ లాంతరు సాయంతో 10 అంగుళాల పొడవు, 10 అంగుళాల వెడల్పు ఉండేలా పెద్దవిగా తెరపై చూపుతారు. భారత్‌లో ఈ వాణిజ్య ప్రదర్శనలకు పితామహుడైన మహదేవ్ పట్వర్ధన్‌కు ఆయన కుమారులైన వినాయక్, రామ్‌చంద్ర (రామ్‌భావ్)లు కూడా అప్పట్లో తోడు నిలిచేవారు. ప్రసిద్ధ జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ పెయింటింగ్‌లో చిత్రకళ అభ్యసించిన పెద్ద కుమారుడు వినాయక్ రావ్ భారతీయ పురాణేతిహాసాల్లోని దృశ్యాలను గాజు పలకల మీద సూక్ష్మ కళాకృతులుగా చిత్రించేవారు. గ్రామీణ మహిళల నుంచి సేకరించిన సహజసిద్ధమైన సేంద్రియ రంగులతో ఆయన ఆ బొమ్మలు వేసేవారు.

జనం, జాతీయ నేతల ప్రశంసలు

ఆ రోజుల్లో ఒక్కో ప్రదర్శన దాదాపు మూడున్నర గంటల పాటు జరిగేది. ఈ కదిలే బొమ్మల ప్రదర్శన చూడడానికి జనం పెద్ద సంఖ్యలో వచ్చేవారట! గమ్మత్తు ఏమిటంటే - భారత స్వాతంత్ర్య సమరయోధుడైన లోకమాన్య బాలగంగాధర్ తిలక్ సైతం అప్పట్లో ఈ ప్రదర్శనలు చూసి ఎంతో ముచ్చటపడడం! ప్రజాభిప్రాయాన్ని మలిచేందుకు సినిమా శక్తిమంతమైన సాధనమని ఇవాళ మనం అంటుంటే, ఈ 'మాయ లాంతరు' చిత్ర ప్రదర్శనల్ని ప్రజాభిప్రాయ పరికల్పనకు సమర్థంగా ఉపయోగించుకొనే వీలుందని తిలక్ అప్పట్లోనే భావించారు.

మహదేవ్ గోపాల్ పట్వర్ధన్

1896 జూలైలో భారతదేశంలో తొలి మూవీ ప్రదర్శన జరగడానికి ఎన్నో నెలల ముందే, 1894 - 95లో పట్వర్ధన్ కుటుంబం మహారాష్ట్ర, గుజరాత్‌లలో దిగ్విజయంగా పర్యటించి, ప్రదర్శనలు జరిపింది. "పూణెలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ 11వ సదస్సులో చేసిన ప్రదర్శనతో 1895 డిసెంబర్ 27న ఆ సుదీర్ఘ పర్యటన ముగిసింది. తిలక్, బొంబాయి హైకోర్టుకు చెందిన జస్టిస్ రణడే, గోఖలే, సురేంద్రనాథ్ బెనర్జీ లాంటి జాతీయ నేతల కోసం ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. వీటిని చూసి, తిలక్ ఎంతో మెచ్చుకొని, ప్రజల్లో దేశాభిమానం జాగృతం చేయడానికి వీటిని ఉపయోగించుకోవాలని భావించారు" అని సునీల్ చెప్పుకొచ్చారు. అప్పట్లో అణా నుంచి నాలుగణాల (ఇప్పటి లెక్కలో సుమారు పావలా) వరకు టికెట్లున్న ఈ ప్రదర్శనలకు భారతీయులతో పాటు విదేశీయులూ హాజరయ్యేవారు.

మూకీలకు ముందు రూపంగా ఫాల్కేకు ప్రేరణ

1902లో మహదేవ్ పట్వర్ధన్ మరణించిన తరువాత ఆయన కుమారులు, ఆ పైన ఆయన మనుమడు, ఇప్పుడు ఆయన ముని మనుమడు సునీల్ ఈ ప్రదర్శనలు ఇస్తూ, ఈ కళను ఓ కుటుంబ సంప్రదాయంగా కాపాడుకుంటూ వచ్చారు. పట్వర్ధన్ కుమారుల కాలానికి వచ్చేసరికి, కొంత మంది సుశిక్షితులైన వారితో కూడిన ఈ ప్రదర్శక బృందం ఒక పక్క ఈ స్లయిడ్‌లను చూపుతూ, మరోపక్క ఆ తెర మీది బొమ్మలకు అనుగుణంగా నేపథ్య సంగీతం, కథాకథనం, సంభాషణలు అందిస్తూ, ప్రేక్షకులను వినోదింపజేసేది. అందుకోసం పట్వర్ధన్ కుటుంబీకులు తమ ప్రదర్శనల కోసం ప్రసిద్ధ రచయితలతో స్క్రిప్టులు రాయించుకొనేవారు. అలాగే, కీలక ఘట్టాల్లోని డైలాగులను సైతం స్లయిడ్‌లుగా రాసుకొని, ఆయా చోట్ల దృశ్యాలకు నడుమ వాటినీ తెరపై చూపేవారు. అలా మూకీ సినిమాలకు అచ్చమైన ముందస్తు రూపాలుగా ఈ ప్రదర్శనలు సాగాయి.

అప్పట్లో 'సీతా స్వయంవర్', 'రామ రాజ్యాభిషేక్', 'హరిశ్చంద్ర', 'శ్రీకృష్ణ జన్మ', 'సతీ అనసూయ', సర్కస్ లాంటి ఏడు కథలతో ప్రదర్శనలు ఇచ్చేవారు. ప్రతి ప్రదర్శనలో కనీసం 1000 దాకా స్లయిడ్‌లు ఉండేవి. మూడు 'మాయ లాంతర్ల' ద్వారా ఆ స్లయిడ్‌లను జనానికి చూపేవారు. దేశంలోని పలు ఎగ్జిబిషన్లలో ఈ 'శాంబరిక్ ఖరోలికా' పలు స్వర్ణ పతకాలు, రజత పతకాలు సాధించింది. ఇలా చేతితో గీసిన వర్ణచిత్రాలతో సినిమా భావన కలిగించడం భారతదేశంలోనే కాక ప్రపంచం మొత్తంలో వినూత్నమైనదీ, విశిష్టమైనదీ అని పాశ్చాత్యులు సైతం పట్వర్ధన్లకు సర్టిఫికెట్లిచ్చారు.

చాలామందికి తెలియని మరో విషయం -

'రాజా హరిశ్చంద్ర'లో ఓ దృశ్యం

భారత చలనచిత్ర పితామహుడైన దాదాసాహెబ్ ఫాల్కే ఇలా కదలికతో కూడిన ఈ స్లయిడ్ ప్రదర్శనల్లో రాజా హరిశ్చంద్ర కథ చూశాక ఆ ప్రభావంతోనే తన తొలి చిత్రం 'రాజా హరిశ్చంద్ర' నిర్మించారు. 1913 మే 3 శనివారం నాడు వాణిజ్యపరంగా విడుదలైన ఆ చిత్రమే మన దేశపు తొలి కథాకథనాత్మక చిత్రం కూడా! చలనచిత్రాల ఆవిర్భావంతో ఆదరణ తగ్గడంతో పట్వర్ధన్‌ల 'మాయ లాంతరు' బృందం చుట్టుపక్కలి ఇళ్ళలోని పిల్లల వినోదానికి ఈ ప్రదర్శనల్ని పరిమితం చేసుకోవాల్సి వచ్చింది.

గత చరిత్రకు తీపి గుర్తు

ఆదరణ బాగా ఉన్న తొలినాళ్ళలో ఏక కాలంలో మూడు 'శాంబరిక్ ఖరోలికా'లను ఉపయోగించగా, ప్రస్తుతం వాటిలో ఒకే ఒక్క మాయ లాంతరు మిగిలింది. ఈ మాయ లాంతరును జాగ్రత్తగా కాపాడి, తమ కుటుంబ వారసత్వాన్ని ప్రపంచానికి చాటడం కోసం పట్వర్ధన్ కుటుంబీకులు ఆ ప్రొజెక్టర్‌నూ, దాదాపు 300 వరకు స్లయిడ్‌లనూ 1983లో ఆర్కైవ్స్‌కు అప్పగించారు. "ఈ సామగ్రి మా ఇంట్లో ఉంటే, కేవలం ఇరుగు పొరుగు పిల్లలకు చూపడానికే పరిమితమయ్యేది. కానీ, ఆర్కైవ్స్‌లో ఉంచడం ద్వారా ప్రపంచం మొత్తానికీ దీన్ని చూపగలుగుతున్నాం" అని బ్యాంకు అధికారిగా పని చేస్తున్న 49 ఏళ్ళ సునీల్ అన్నారు. భార్య సీమ, యువకులైన కుమారులు అక్షయ్, అథర్వలు ఈ ప్రదర్శనల్లో ఆయనకు తోడ్పాటునిస్తున్నారు. 2009లో గోవాలో జరిగిన 40వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ)లో సైతం ఈ ప్రొజెక్టర్‌తో పదుగురి ఎదుట ప్రదర్శన ఇచ్చారు.

ఒకప్పుడు పెద్ద వినోద సాధనంగా ఎందరినో ఆకర్షించిన ఈ 'మాయ లాంతరు' ఇప్పుడు గత చరిత్రకు తీపి గుర్తుగా మిగిలింది. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్లలో, చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శనకు పరిమితమైంది. కాగా, మూకీల కన్నా ముందు రోజుల నుంచే భారతదేశానికి చిత్ర ప్రదర్శనతో ఉన్న అనుబంధాన్ని సజీవంగా నిలపడం కోసం పట్వర్ధన్ కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్నారు. నిజమే! రంగస్థల ప్రదర్శనలకూ, సినిమాకూ మధ్య అనుసంధాన సూత్రంగా పనిచేసి, భారతీయ సినిమా వారసత్వంలో భాగమైన ఈ ఆఖరి లంకెను కాపాడుకోవడమే చరిత్ర, వారసత్వాల పట్ల నిజమైన ప్రేమకు నిదర్శనం! ★

చూద్దామా

మన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో తప్పనిసరిగా చూడాల్సిన ప్రదేశాలలో గోల్కొండ కోట ఒకటి. కుతుబ్ షాహి రాజుల పరిపాలనకు సాక్షీభూతంగా నిలిచిన ఈ కట్టడాన్ని చూడడం ఓ అద్భుతానుభవం. నాటి రాజుల ఆయుధాగారాలు, ధాన్యశాలలు, స్నాన శాలలు, వంటశాలలు మొదలుకొని ఆశ్వశాలలు, నూనె నిల్వ చేసే గది...ఓహ్! వర్ణించడం కష్టం. ఆరోజుల్లోనే (క్రీశ1518) వేడినీటి శాలలు, చప్పట్లు కొడితే అల్లంత దూరాన వినిపించే సౌకర్యం వంటివి ఆశ్చర్యచకితులను చేస్తాయి. మరి ఆ వివరాలేంటో చూద్దామా!

గోల్కొండ కోట

గోల్కొండ కోట గోడ చాలా గట్టిగా, ఎత్తుగా, పెద్ద రాతి బండలతో కట్టినది. దీని విస్తీర్ణము దాదాపు 5మైళ్ళు. ఈ కోటకు 9 తలుపులు, 52 కిటికీలు, 48 మార్గములు వున్నాయి. ఈ కోట గోడకు లోపలి వైపున పెద్ద కందకము వుంది.

కోట ద్వారములు: కోటకు మొత్తం తొమ్మిది (తలుపులు) ద్వారాలున్నాయి. ఫతే దర్వాజ, మోతి దర్వాజ, కొత్తకోట దర్వాజ, జమాలి దర్వాజ, బంజారి దర్వాజ, పటాంచెరు దర్వాజ, మక్కా దర్వాజ డబుల్, బొదిలి దర్వాజ, బహిమని దర్వాజా. వీటిలో 1,2,3,4,5,7 ప్రయాణీకుల సౌకర్యార్థము తెరచి వుంటాయి. మిగిలిన వాటిని మూసివేశారు.

కోట బురుజులు: ఈ కోటకు మొత్తం 87 బురుజులున్నాయి. వీటిలో పెట్లా బురుజు, మూసా బురుజు, మజ్‌నూ బురుజు ప్రసిద్ధి గాంచినవి. పెట్లా బురుజు కోటకు ఉత్తర పడమర మూలగా వుంటుంది. దీని మీద అలంగిరీ జయమునుకు గుర్తుగా ఫిరంగి అమర్చబడి ఉంది. ఇది 16 అడుగులు పొడవు ఉంటుంది. ఒక మణుగు (165 పౌండ్ల బరువు గల) ఫిరంగి గుళ్ళు ఉంచే వీలుంది. ఇది చూడ్డానికి చాలా అందంగా వుంటుంది. కోటకు దక్షిణముగా మూసా బురుజు ఉంది. 1666 సంవత్సరములో (1977 హిజ్రి) కమాండర్ మూసా ఖాన్ ఆధిపత్యములో ధర్మాచారి అనే మేస్త్రీ దీన్ని నిర్మించాడు. దీని మీదుగా "మీరాన్" అను ప్రసిద్ధిగాంచిన సైన్యాధిపతి హతుడౌతాడు. అతని స్ధానంలో"మూసా ఖాన్" నియమితుడవుతాడు. బురుజు మీద ఫిరంగి అమర్చి వుంటుంది. ఇది కూడా పెట్లా బురుజు ఫిరంగి మాదిరిగా దాడిచేయడానికి వీలుగా ఉంటుంది.

కరోరా హౌస్: ఇది కోటలోని 'బాలాహిసార్' కు ఉత్తర దిశగా నిర్మితమై ఉన్నది. ఇది 200 గజముల పొడవు, అదే వెడల్పులో, 5 గజముల లోతుగా నిర్మించిన నీటిని నిలువచేసే స్ధలం. దీనిని ఒక చెరువు నుండి వచ్చే నీటితో నింపేవారు. దీనికి పడమర దిశలో ఉన్న గేటు దగ్గర శబ్దం చేస్తే అది అన్ని వైపులకు ప్రతిధ్వనిస్తుంది. ఈ నీటి హౌస్‌ను రాజులు, మరి కొందరు ప్రముఖులు వినోద స్థలముగా ఉపయోగించేవారు.

ఆయిల్ స్టోర్ హౌస్: ఇది నూనె దాచి ఉంచే కట్టడం. ఇది 30 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పు, 10 అడుగుల లోతున ఒకే రాతితో మలచబడినది. దీనిలో 12,000 గ్యాలన్ల నూనె నిల్వచేసి, సప్లయి చేసేవారు.

ధాన్ కోట లేక గోడౌన్: ఇది ఆహార ధాన్యములను దాచి ఉంచే స్థలము. దీనిని యుద్ధ సమయములలో బయటి రాజ్యముల నుండి తెప్పించి నిలువ చేసేవారు.

జమా-ఎ-మసీద్: ఈ ప్రార్ధనా మందిరము కోటలోని బాలాహిసార్ ద్వారమునకు ఎదురుగా తూర్పు దిశగా ఉంది. దీనిని ఒకటవ సుల్తాన్ కులీ కుతుబ్ షా కట్టించాడు. దీని ద్వారము మీద చరిత్ర ప్రసిద్ధిగాంచిన అరబిక్ భాషలో రాసిన చెక్కడము వుంది.

బాలాహిసార్: ఇది 15 మైళ్ళ విస్తీర్ణముతో కొండల మీద నిర్మించపబడినది. ఇక్కడ చాలా కట్టడములున్నాయి. వాటిలో కుతుబ్‌షా భవనములు, దర్బార్ ఎ-ఆల్ అనే జనరల్ అసెంబ్లీ హాల్ (విధాన సభ), దర్బార్ -ఎ-ఖాన్ అనే ముఖ్యమైన విధాన మండపములున్నాయి. ఇంకా నూతులు, మందుగుండు సామాను దాచి ఉంచు గది, ఆయుధ కర్మాగారం, మసీదులు, దేవాలయాలు, భక్త రామదాసును బంధించిన జైలు, నీటి రిజర్వాయరు, పెద్ద తోట, స్నాన గదులు, తుపాకులు, మందు గుండు సామాను దాచి ఉంచు గది, కుడివైపు దర్బార్-ఎ-ఆమ్ అనే అసెంబ్లీ హాలుకు పోవుటకు మార్గము... ఎడమవైపు రాజభవనము నిర్మింపబడినది.





కర్టెయిన్ వాల్: యుద్ధ సమయములలో శత్రువుల పోకడలను గమనించుటకు వీలుగా బాలాహిసార్ ద్వారముల కెదురుగా నిర్మింపబడిన తెరవంటి గోడ. బాలాహిసార్ గేటుకు వెలుపలి భాగములో ఒక రంధ్రము ఉంటుంది. యుద్ధ సమయములో శత్రువు గేటు ద్వారా ఏనుగులతో తోయించే సమయంలో దీని నుండి కాగుతున్న నూనెను కాని, కరిగిన లోహమునుకాని పోసేవారు.

వైబ్రేషన్: బాలాహిసార్ గేటు మధ్యభాగంలో మెట్లకు ఎదురుగా నిల్చొని చప్పట్లు కొడితే... తిరిగి బాలాహిసార్ ఎత్తయిన భాగము నుండి మారుమోగుతుంది.

కుతుబ్‌షా రాజుల స్నానము: బాలాహిసార్ గేటు నుండి లోనికి ప్రవేశించేటపుడు కుడి చేతి వైపు ఈ స్నానముల గది వుంది. కొంచెము నగీనా తోటకు కుడి చేతి వైపు పక్కన వేడి నీళ్ళు... చన్నీళ్ళు వచ్చేలా నేల మార్గమున గొట్టములను అమర్చి కట్టినది. ఈ కుళాయిలను చెరువు నుండి నింపేవారు. ఈ నీటిని అతి ముఖ్యమైన సందర్భములలో ఉపయోగించేవారు. ఎవరయినా రాజ వంశస్తులు దివంగతులైనపుడు ఇక్కడ వేడి నీటితో స్నానము చేయించి శవపేటికను ఉత్తరపు ద్వారము నుండి బయటకు తీసుకెళ్లేవారు.

నగీనా బాగ్: తోటకు దక్షిణముగా ఆర్కులలో రాజకుమారులు, రాజకుమార్తెలు ఊగేందుకు ఊయలలు అమర్చబడి ఉన్నవి. ఇప్పటికీ వాటి గుర్తుగా ఆర్కులోని రాళ్ళలో రంధ్రములు కన్పిస్తాయి. నగీనా గార్డెన్ నుండి వెళ్ళే సన్నని మార్గంలో ఎడమ చేతివైపు ఒక కట్టడము వుంది. ఇది రక్షకభటుల కోసం నిర్మించిన భవనము. కుతుబ్‌షా వంశపు రాజులలో ఏడవవాడు, ఆఖరివాడు అయిన అబ్దుల్ హసన్ తానీషా పరిపాలనలో, రక్షక భటులకోసం కట్టబడిన భవన మార్గములోనే ఆయన మంత్రివర్యులైన అక్కన్న మాదన్నల కోసం నిర్మించిన కార్యాలయ భవనం వుంది.

బడీ బౌలి: బాలాహిసార్ మెట్లకు కుడిపక్కగా ఒక పెద్ద బావి వుంది. దీనిని బడీ బౌలి అని పిలిచేవారు. ఈ బావిలో ఒక మూల రాయి వుంది. అది వేసవి కాలములో నీరు కిందపడడానికి ఉపయోగపడేది. ఈ బావికి దగ్గరలో రెండు వరండాలున్న ఒక భవనముంది. దీనిలో రాజులు కూర్చొని ప్రకృతి సౌందర్యమును తిలకించేవారు.

డ్రగ్ ట్యాంక్ కాలువ: బడి బౌలికి కొద్ది దూరంలో మెట్లకిందుగా పారే ఒక కాలువ వుండేది. ఇది డ్రగ్ చెరువు కోటకు 5 మైళ్ళ దూరంలో వుంది. కోటలో ఉన్న తోటలకు, చేలకు ఈ కాలువ ద్వారానే నీరును మళ్ళించేవారు, పంటలు పండించేవారు.

భక్త రామదాసు చెరసాల: మనము ఈనాడు వింటున్న రామదాసే ఆనాటి కంచర్ల గోపన్న. 1674వ సంవత్సరములో అబుల్ హసన్ తానీషా "గోల్కొండను పరిపాలించే కాలములో" భద్రాచలము తాలూకాకు తహశీల్దారుగా ఉండేవాడు. ఈయన మంత్రివర్యులైన మాదన్నకు మేనల్లుడు. ఈయన భద్రాచలం రామచంద్రునికి దేవాలయాన్ని కట్టించాడు. ఈయన జైలు శిక్షసమయములో ఆయన స్వహస్తములతో "హనుమంతుని విగ్రహములను, నవగ్రహములను" తయారుచేశాడు. పై రాతి మీద రామలక్ష్మణులను కూడా తయారుచేశాడు. ఇది ఆయనకు చెరసాలలో పూజా మందిరం. శ్రీరామనవమి సందర్భంగా ఇప్పటికీ భద్రాచలం వచ్చిన యాత్రికులు శ్రీరామదాసు జైలును చూడ్డానికి గోల్కొండ కోటకు వస్తుంటారు.

ఇబ్రహీం కుతుబ్ షా మసీదు: ఇది ఇబ్రాహీమ్ కులికుతుబ్‌షా కాలము నాటిది. కొన్ని మెట్ల తరువాత ఈ మసీదుకు తూర్పుగా ఒక అర్ధ వలయాకారము వుంది. దీని నుండి గోల్కొండ కోట మొత్తం చూడొచ్చు. హైదరాబాదు నగర భవనములు కూడా చూడొచ్చు.

ఎల్లమ్మ దేవి: అక్కన్న మాదన్న మరియు అబ్దుల్ హసన్ తానీషా కాలములో కట్టినదీ దుర్గాదేవి లేక మహాకాళి అమ్మవారి మందిరం. ఇక్కడ ప్రతి ఆషాఢ మాసములో జాతరలు జరుగుతాయి. జంట నగరాల నుండి అనేక మంది సందర్శకులు వస్తుంటారు.

బారాదరి: ఇది మూడు అంతస్తులలో నిర్మించబడిన రాజుగారి సభా మండపము. దీని నుండి "గోషామహల్ బారాదరి హైదరాబాదు" భూమార్గము కూడా వుంది. దీని పై అంతస్తులో



రాజ సింహాసనము వుంది. దీని నుండి 30 మైళ్ళ విస్తీర్ణములో అతి సుందరము, శోభాయమానముగా కన్పిస్తుంది. ఇది సముద్ర మట్టమునకు 400 అడుగుల నుండి 2000 అడుగులుంటుంది. దీని నుండి తూర్పుగా కుతుబ్‌షా వంశపు శిథిలమైన భవనములు, లంగర్‌హౌజ్ చెరువు, హైదరాబాద్ నగరమున ముఖ్య కట్టడమైన చార్‌మినార్, మక్కా మసీదు, ఉస్మానియా వైద్యశాల చూడొచ్చు. తూర్పు-దక్షిణ మూలగా మీర్ ఆలమ్ చెరువు, ఫలక్‌నుమా భవనము, దక్షిణముగా మక్కై దర్వాజా, హిమయత్‌నగర్, దీనికి దక్షిణమున పడమర మూలగా తారామతి, ప్రేమామతి భవనములు, ఉస్మాన్ సాగర్ చెరువు (గండిపేట) పడమరగా వున్నాయి. తూర్పు - ఉత్తర మూలగా హుసేన్ సాగర్ చెరువు, సికింద్రాబాదు నగరము, ఉస్మానియా యూనివర్సిటీని చూడవచ్చు. ఉత్తర-పడమర మూలగా కుతుబ్‌షా రాజుల గోపురములు పెట్లాబురుజు చూడొచ్చు. ఉత్తరముగా గోల్కొండ కోట పట్టణము, హకీం పేట, బేగంపేట విమానాశ్రయాన్ని చూడొచ్చు.

నీటి సదుపాయములు: బాలాహిసార్‌కు కింద భాగమున, తూర్పు దిశగా కుతుబ్‌షా భవనమును దాటాక 800 అడుగుల ఎత్తులో నిర్మించిన 5 కొళాయిలున్నాయి. అన్నిటికంటే ఎత్తయిన కొళాయిలో పర్షియన్ చక్రవర్తి సహాయంతో నీటిని నింపేవారు. అక్కడి నుండి కొన్ని ప్రదేశాలకు నీటిని అందజేసేవారు.

ఆర్మరి: ఇది బాలాహిసార్ గేటు ప్రవేశములోనే ఎడమ వైపు నిర్మించబడిన మూడంతస్తుల భవనం. దీనిలో చిన్న చిన్న తుపాకులు, ఫిరంగి గుళ్ళు మొదలుగునవి దాచి పెట్టేవారు. దీనికి దక్షిణాన చరిత్ర ప్రసిద్ధి చెందిన ఒక బావి వుంది. 1687 సంవత్సరంలో ఔరంగజేబు దండెత్తి తానీషాని బంధించిన గోల్కొండ కోటను ఆక్రమించిన సమయమున ఆయన భార్య, బిడ్డలు శత్రువుల నుంచి రక్షణ పొందడానికి దీనిలో దూకారని చెప్తారు.

దాద్ మహల్: రోడ్డుకు తూర్పు దిశగా దీని బాల్కనీ వుంది.. బాల్కనీ ముందు పెద్ద ఖాళీ స్థలము వుంటుంది. ఇక్కడికి ప్రజలు వచ్చి తమ కష్టసుఖాలు చెప్పుకొనేవారు. రాజు ఈ బాల్కనీలోంచి వినేవారు. ★



ఊరు మారుతోంది!

మనం ఎవరం ఎక్కడ ఏ స్థాయిలో ఉన్నా మన మూలాలన్నీ గ్రామాల్లోనే! 'గ్రామాలు వికసించిననాడే సంపూర్ణ దేశాభివృద్ధి సాధ్యం అవుతుంది' అన్నారు గాంధీ. అభివృద్ధి మాటకేం గానీ, మన గ్రామాల్లో చాలా మార్పులొస్తున్నాయి. ముఖ్యంగా సరళీకరణ విధానాలు మొదలయ్యాక- ఈ మార్పు వేగం పుంజుకొంది. పట్టణాలకూ, పల్లెలకూ ఉన్న స్పష్టమైన వైవిధ్య రేఖ క్రమేణా చెరిగిపోతోంది. ఆధునిక సదుపాయాలూ సౌకర్యాలూ, అనేక కొత్త అలవాట్లూ పల్లె దినచర్యలో భాగమైపోయాయి. ఎక్కడ ఏం జరిగినా ఊరికి క్షణాల్లో సమాచారం అందిపోతోంది. ప్రపంచంతో పాటే ఊరూ స్పందిస్తోంది. ప్రభావాలకు గురవుతోంది. ఈ ఒరవడిలో కొన్ని మేలిమి లక్షణాలను వదులుకుంటోంది. కొన్ని ఆధునిక నైపుణ్యాలను నేర్చుకుంటోంది.

-సుజయ సాహితి

మన దేశానికి ఇప్పటికీ వ్యవసాయమే ప్రధానం. అత్యధిక మందికి ఈ రంగమే ఆధారం. వ్యవసాయం అనేది ఒక సమిష్టి, సామూహిక పరిశ్రమ. దాని చుట్టూనే మన ఊరి నిర్మాణం, నిర్వహణా ముడిపడి ఉన్నాయి. ఊళ్లోని అన్ని వృత్తుల వారికీ, అన్ని తరగతుల వారికీ సేద్యంతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు నెలకొని ఉంటాయి.

తొలకరి పలకరించగానే తొలుత కళకళలాడేది కమ్మరం. బళ్లూ, నాగళ్లూ, బొరుగులూ, కొడవళ్లూ కొత్తకొత్తగా ముస్తాబయ్యేవి. మేదరి వీధిలో వెదురు బద్దలు సన్నసన్నగా చీలిపోయి, బుట్టలూ తట్టలుగా కొత్త రూపం సంతరించుకునేవి. గెత్తం కొట్లు బండెక్కి పంటపొలాల్లో కొలువు తీరేవి. చినుకులు చిందేసి, పొలాలు పదునెక్కితే- దుక్కుల కోలాటం మొదలు. రైతు ఇంట్లో భద్రంగా దాచిన విత్తనాలు దుక్కి మళ్లలో చిందులు. కొద్ది రోజుల్లోనే చిన్ని విత్తనం నేల చెమ్మకు తెప్పరిల్లి, వేడి హాయికి ఎత్తిరిల్లి పసికూనల్లా పైకి లేచే దృశ్యం ఎంత కమనీయమో! పనిపాటల్లో మునిగితేలిన పల్లెజనం నోటినిండా జానపదం ఎన్ని హొయలు పోయేదో! పంట చేతికొచ్చేవేళ పండగ సందడి. ఊరందరి ఉమ్మడి హడావిడి.

ఇప్పుడు ఈ దృశ్యం మారింది! ప్రపంచీకరణ తొలి దెబ్బకు చేతివృత్తులపై పడింది. ట్రాక్టర్లూ, ఇతర ఆధునిక యంత్ర సామగ్రి రంగప్రవేశంతో- సేద్యానికీ, చేతివృత్తిదారులకూ ఉన్న సంబంధం తెగిపోయింది! ఎరువులతో చేనుకు చేవ పెరిగి, దిగుబడి ఇనుమడించింది. ఆ వెనకనే పురుగుమందులూ, క్రిమికీటక నాశనలూ అనివార్యమయ్యాయి. విత్తనం దాచుకునే సాంప్రదాయానికి విఘాతం ఏర్పడింది. వాణిజ్య పంటలు పెరిగాయి. ఆదాయమూ పెరిగింది. అదే సందర్భంలో అనేక కొత్త సమస్యలు మొదలయ్యాయి. ఒకప్పుడు కాయకష్టమే పెట్టుబడి. ప్రకృతి ప్రతికూలించినా పెద్దగా నష్టం ఉండేది కాదు. దాని భారం రైతు ఒక్కడే కాదు, సేద్యంలో మమేకమైన వృత్తిదారులంతా భరించేవారు. ఇప్పుడు వేలకు వేల పెట్టుబడి.

అనివార్యంగా అప్పులు చేయాల్సిన పరిస్థితి. సాంప్రదాయక సాగు నుంచి వేరు పడ్డం వల్ల ప్రతి పనికీ డబ్బు చెల్లించాల్సి వస్తోంది.

పెద్ద రైతులు ఎక్కువమంది పిల్లల ఉద్యోగాలూ చదువులు అవసరాలరీత్యా పట్టణాలకు చేరారు. పేద రైతులు, కొంతమంది చేతివృత్తిదారులు, వ్యవసాయ కార్మికులు కౌలు రైతులుగా రూపాంతరం చెందారు. పెరిగిన పెట్టుబడులూ, ప్రకృతి నష్టాలూ వీరు తట్టుకోవడం కష్టమవుతోంది. వ్యవసాయంలో ఒడిదుడుకులు పెరిగే కొద్దీ పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. ఈ పదీ, పదిహేనేళ్ల కాలంలో పట్టణ కార్మికులుగా, చిన్నచిన్న వ్యాపారులుగా మారుతున్న గ్రామీణుల సంఖ్య మూడు రెట్లు అయింది.

పిల్లలకు పట్నం చదువులు

80వ దశకంలో పట్టణాల్లో ప్రారంభమైన ప్రైవేటు పాఠశాలలు ఇప్పుడు చాలా పల్లెటూళ్ల వరకూ పాకాయి. ఒకప్పుడు ఏ ఆర్థిక స్థాయికి చెందిన పిల్లలైనా ఊరి స్కూల్లో కలిసిమెలసి చదువుకునేవారు. ఇప్పుడు ఊరి స్కూల్లో చదివే పిల్లల సంఖ్య బాగా తగ్గింది. ఊళ్లోకి సమీప పట్టణాల్లోంచి ప్రైవేటు స్కూలు బస్సులు వస్తున్నాయి. చదువు'కొనే' పిల్లలు చిన్నప్పటినుంచి స్థోమతు ఆధారంగా విడగొట్టబడుతున్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన కుటుంబాల పిల్లలు సర్కారు బడులకు లేదా తక్కువ ఫీజు తీసుకునే ప్రైవేటు స్కూళ్లకు పరిమితమవుతున్నారు. పిల్లల చదువుల కోసం మధ్య తరగతి కుటుంబాల వారు పట్టణాల్లో కాపురాలు పెడుతున్నారు. ధనిక రైతులు సేద్యం వదిలేసి, సమీప పట్టణాల్లో వ్యాపారాలూ రాజకీయాలూ జమిలిగా నడుపుతున్నారు.

చదువు మాదిరిగానే వైద్యానికి సంబంధించిన స్పృహ గ్రామాల్లో బాగా పెరిగింది. సెల్ ఫోన్ల లభ్యతతో 108 వంటి సేవలను వినియోగించుకోవడం పెరిగింది. వైద్యానికి వెచ్చిస్తున్న ఖర్చు హెచ్చింది. గతంతో పోలిస్తే ఆసుపత్రి ప్రసవాలు బాగా పెరిగాయి. వైద్యం కూడా ఆర్థిక స్థాయులబట్టి విడిపోయింది. వైద్యంపై పాలకుల శ్రద్ధ తగ్గిపోయింది. పల్లె పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఆరోగ్య శ్రీ వంటి ఆకర్షక పథకాల హవాలో ప్రాథమిక వైద్యాలయాలు నీరసించిపోయాయి.

ఆటలన్నీ క్రికెట్టు ఆడుతున్నాయ్!

ఒకప్పుడు ఊరెళితే వినిపించే జానపదాలు ఇప్పుడు లేవు. టీవీలు, ఎఫ్ఎంల మోతలో అవన్నీ మూగబోయాయి. ఇదే సమయంలో బుల్లితెర పోటీల పుణ్యమాని- జానపద బాణీలు బాగా పాపులర్ అయ్యాయి. తెలంగాణా జిల్లాల్లో జానపద గీతాల సీడీల వ్యాపారం పెద్దఎత్తున సాగుతోంది. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో పల్లెపదాలు వినిపించడం తగ్గిపోయింది. ఇప్పుడు సంబరాలకు ఎంత ఖర్చు పెట్టినా ఊరుమ్మడి సందడి లేదు. ఒకప్పటిలా ఉత్సవాలకు ఊరందరూ హాజరు కావటం లేదు. వన్స్‌మోర్ పద్యాల జాడే లేదు. అంతా డాన్స్ బేబీ డాన్స్ సందడే! హరిదాసు, కొమ్మదాసు, గంగిరెద్దూ, తాడిపెద్దూ ... అచ్చం మనలాగే పండక్కి మాత్రమే వచ్చి వెళ్లే అతిథులు. కుర్రకారు హుషారు పెరిగింది. ఆధునికతను అత్యంత వేగంగా ఊళ్లకు మోసుకొస్తున్నది వారే మరి!

పదుల సంఖ్యలో ఉన్న గ్రామీణ క్రీడలు ఎప్పుడో చెట్టెక్కేశాయి. కబడ్డీకి మన ఊరే పుట్టిల్లు అయినప్పటికీ- దాని జాడ ఇప్పుడు కనపడడం లేదు. ఐదారేడు పిల్లల దగ్గర నుంచి నూనూగు మీసాల యువకుల దాకా అందరికీ ఒకటే ఆట- క్రికెట్టు! అక్కడక్కడ వాలీబాల్ కనిపిస్తోంది. పండగల వేళ కొంతమంది పెద్దలూ, కొన్ని సంస్థలూ గ్రామీణ క్రీడలను నిర్వహిస్తుంటే- పల్లెలూ అపురూపంగానే చూస్తున్నాయి.

కొత్త అలవాట్లు

గతంలో గ్రామాల్లో బంధువుల, మిత్రుల ఇళ్లకు వెళితే తొలుత మజ్జిగో, కొబ్బరినీళ్లో ఇచ్చేవారు. ఇప్పుడు కూల్‌డ్రింకులతోనే మర్యాద ప్రారంభమవుతుంది. బూరెలూ గారెలూ, అరిసెలూ సున్నుండలూ వంటి సాంప్రదాయక పిండివంటలు పండక్కే పరిమితం. టీవీల పుణ్యమాని ఎప్పటికప్పుడు కొత్త వంటలు వచ్చి చేరుతున్నాయి.

పెళ్లిళ్లూ పేరంటాలూ ఎప్పటికప్పుడు కొత్త హంగులు సంతరించుకుంటున్నాయి. స్థితిమంతులకు ఈ వ్యవహారం గొప్పగానూ, సరదాగానూ ఉన్నప్పటికీ- సామాన్యులకు పెనుభారమైంది. ఇంతకముందు అలవాటు లేని కుటుంబాల్లోనూ, సామాజిక తరగతుల్లోనూ ఇప్పుడు వరకట్నం తప్పనిసరైంది. మండగొలుసులూ, ద్విచక్రవాహనాలూ పెళ్లికొడుకులకు అదనపు కానుకలుగా స్థిరపడిపోయాయి. అప్పుల పాలైనా పెళ్లిళ్ల 'ఘనంగా' చేస్తున్నారు. ఒకప్పుడు పెళ్లిరోజునే హడావిడి ఉంటే- ఇప్పుడు నిశ్చితార్థం, పుట్టిన్రోజు వంటివి కూడా ఆడంబరంగా నిర్వహించడం మొదలైంది. 'పేరయ్య గారి పెళ్లిలో *టేబులు భోజనాలంట!'* అని ఆశ్చర్యంగా చెప్పుకునే రోజులు గతించి ఏళ్ల గడిచిపోయాయి. ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా తాటాకు పందిరికి బదులు టెంటుహౌసూ, భోజనాలకు టేబుళ్లూ కుర్చీలూ సిద్ధంగా ఉంటున్నాయి. కొన్ని సందర్భాల్లో జనం బఫే పద్ధతిలోనూ బారులు తీరుతున్నారు.

చాలా గ్రామాలకు రక్షిత తాగునీరు లేదు. కానీ, బెల్టుషాపుల రూపంలోనో, మరోరూపంలోనో బ్రాందీషాపులు మాత్రం ఉన్నాయి. కుర్రకారులో మందుపార్టీల సంస్కృతి

మాయమైన వస్తు సామగ్రి.. పదసంపద

ఒకప్పుడు ఇంటింటా వర్ధిల్లిన రోళ్లూ, రోకళ్లూ, సన్నికాళ్లూ, రుబ్బురోళ్లూ మాయమయ్యాయి. మిక్సీలూ, గ్రైండర్లూ వంటిట్లో చేరాయి. కుండలు, చట్టిలు, గరిసెలు, దాగర్లూ, కర్ర తెడ్డులు వంటివి వెతికినా దొరకవు. ఏ పెద్దింటి దగ్గరో ఉండి గొప్ప గౌరవాన్ని కొట్టేసిన రేడియోలు, టేప్ రికార్డుర్లూ టీవీల దెబ్బకి మూలకు చేరిపోయాయి.

ఇంకా ఈ వరసలో ఎన్నో ఉన్నాయి : చిబ్బులు, తాటాకు బుట్టలు, వెదురుబుట్టలు. ధోవతులు, గావంచాలు వంటి వస్త్ర విశేషాలు ఆఖరి దశలో ఉన్నాయి. వ్యవసాయంలో ట్రాక్టర్లు వచ్చాక- కాడెద్దులు కనుమరుగయ్యాయి. దోపటెద్దు, ఎలపటెద్దు, మొత్తాలు.. వంటి పద సంపద వ్యవహారంలోంచి తప్పుకుంది! బాప్ప, దొడ్డ, అత్త, చిన్నమ్మ, పిన్ని పిలుపులను ఇంగ్లీషు ఆంటీ అమాంతంగా మింగేసింది. మమ్మీ, డాడీ, అంకులూ... మిగతా పిలుపుల్ని మాయం చేసేశారు!



ఇలా పప్పన్నం తిని ఎన్నాళ్లయిందో...

పెరిగింది. ఒకప్పుడు హీనంగా చూసిన అలవాటు ఇప్పుడు హోదాచిహ్నంగా మారిపోతుంది.

పల్లె పరుగు నేర్చింది!

నిలబడి నీళ్లు తాగడం మేలు అనేది ఒకప్పుడు పల్లె సిద్ధాంతం. ఇప్పుడు చాలామందిలో పరుగులెత్తయినా పరమాన్నం తినాలన్న థియరీ స్థిరపడింది. మారిన జీవన సరళి, అవసరాలకు అనుగుణంగా సంపాదన తాపత్రయం, అన్వేషణా పెరిగాయి. ఫైనాన్సు, మైక్రో ఫైనాన్సు, రియల్ ఎస్టేటు వంటి వ్యవహారాలు చాలా గ్రామాలను తాకాయి. అప్పు చేసి పప్పుకూడా? అన్న సంశయం, ఎత్తిపొడుపూ పాతగిల్లాయి. రేపటి సంపాదనకు నేడే అనుభవించే ఇన్‌స్టాల్‌మెంటు ఆనందం అక్కడా ప్రారంభమైంది. దాని విష పరిణామాలూ గ్రామాలను చుట్టుముడుతూనే ఉన్నాయి.

ఆడపిల్లలకు చదువెందుకు? అని ప్రశ్నించే వాతావరణం తగ్గింది. పిల్లలు ఆడైనా మగైనా సమానంగా చూడాలన్న దృక్పథం పెరిగింది. మగపిల్లల పట్ల మక్కువ తగ్గలేదు. ఆధునికత అనేక అవకాశాలను ముందుకు తెచ్చినా- మహిళల పట్ల, కొన్ని సామాజిక తరగతుల పట్లా వివక్ష కొనసాగుతూనే ఉంది!

రోజువారీ పనుల్లో వేగం పుంజుకొంది. ఒకప్పుడు ఎంత దూరమైనా నడిచిన జనం ఇప్పుడు కొంత దూరానికైనా బైకునో, ఆటోనో ఆశ్రయించడం మామూలైంది. శారీరక శ్రమ తగ్గింది. తిండి తీరూ మారింది. ఫలితంగా- ఒకప్పుడు చాలా అరుదుగా కనిపించే స్థూలకాయం, హృద్రోగ సమస్యలు ఇప్పుడు గ్రామాలకు పాకాయి.

సౌందర్య దృష్టి

శ్రమైక జీవన సౌందర్యానికి సాటే లేదని అనుకున్న చోటే- ఇప్పుడు శారీరక సౌందర్య దృష్టి పెరిగింది. అందచందాలపట్ల మక్కువ, తపన ఎప్పుడూ ఉన్నవే అయినప్పటికీ- బ్యూటీక్లినిక్కుల తత్వం ఇప్పుడు ఊరినీ ఊరిస్తోంది. ఒకప్పుడు పెళ్లి కూతురిని చేయటానికి నలుగురు అమ్మలక్కలు చాలు. ఇప్పుడు పట్టణంనుంచి వచ్చిన బ్యూటీషియన్ ఆ పని చేస్తోంది. ఒక మాదిరి పెద్ద ఊళ్లలో మగవాళ్ల కోసం కూడా సెలూన్లూ, బ్యూటీ సెలూన్లూ వెలిశాయి. సున్నిపిండి, కుంకుడురసం స్థానే డోవ్‌లూ, షాంపూల వాడకం పెరిగింది.

పట్నవాసం మక్కువ

టౌను పక్కకెళ్లొద్దురో అన్న హితవు అటకెక్కి చాలా ఏళ్లయింది. పక్కనున్న పట్టణాలకు ఏదొక అవసరంరీత్యా వెళ్లడం బాగా పెరిగింది. పిల్లల చదువు, ఉపాధి పేరిట చాలామంది పట్టణాల్లో ఉండటానికి ఇష్టపడుతున్నారు. ఒకప్పుడు గ్రామాల్లో పనిచేసే ఉద్యోగులు ఊళ్లోనే ఉంటూ గ్రామ వికాసానికి ఎంతోకొంత తోడ్పడేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎవరు ఎక్కడ పనిచేసినా పట్నంలోనే కాపురం. ఉద్యోగులకు, గ్రామస్తులకు మధ్య సహజంగా బలపడే ఆత్మీయబంధం ఇప్పుడు లేకుండా పోతోంది.

ఈకాలంలో పల్లెలకు వినియోగదారీతత్వం బాగా అంటింది. టీవీల విజృంభణతో వ్యాపార సంస్థల వాణిజ్య ప్రకటనలు నేరుగా నట్టింట్లో హోరెత్తుతున్నాయి. గ్రామీణ మార్కెట్టు బాగా విస్తరించింది. సబ్బులూ, సౌందర్య సాధనాలూ, గృహోపకరణాల కొనుగోళ్లు బాగా పెరిగాయి. మైక్రో ఫైనాన్స్ వేళ్లూనిన చోట వినియోగదారీతత్వం మరింత ఎక్కువగా ఉన్నట్టు ఒక సర్వేలో తేలింది. కుగ్రామంలో సైతం సెల్లు మోత వినిపిస్తోంది. మాటలకే కాదు; పాటలకూ, ఫొటోలకూ సెల్లును ఉపయోగించడం చాలా సాధారణమైపోయింది! ఒకప్పుడు సైకిలు ఉంటేనే గొప్పనుకున్న ఊళ్లో ఇప్పుడు మోటారు సైకిళ్లు జోరందుకున్నాయి. కొన్నిచోట్ల పొలాల గట్లుపైనా షికారు చేస్తున్నాయి.

వ్యవసాయేతర ఉపాధి!

నేరుగా వ్యవసాయం చేయటానికి గ్రామీణ యువత ఆసక్తి చూపటం లేదు. కష్టించినా 'లాభం' లేకపోవడంవల్ల, గిట్టుబాటు కాకపోవడంవల్లా కొత్తతరం పొలం తోవ వదిలేస్తోంది. వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్లు, ట్రాక్టర్లూ, ఆటోలూ నడపడం, కోళ్ల ఫారాలూ, డెయిరీల నిర్వహణ... వంటి రూపాల్లో స్వయం ఉపాధికి సన్నద్ధమవుతోంది. తొలుత ఈ రంగాల్లో ప్రవేశించినవారు ప్రయోజనం పొందడంతో- క్రమేణా పోటీ వాతావరణం నెలకొంటోంది. గ్రామీణ యువకుల, మహిళల స్వయం ఉపాధీ తాపత్రయాన్ని ఆసరాగా చేసుకొని గ్రామాల్లో సైతం ఫైనాన్స్ వ్యాపారం వర్ధిల్లుతోంది!

సాంప్రదాయ వ్యవసాయ బంధాలు తెగిపోయి, వాణిజ్య ప్రధాన సేద్యం మొదలు కావడంతోనే సంక్షోభానికి బీజాలు పడ్డాయి. రైతు చేతిలో తరతరాలుగా ఉన్న సాధనాలు ఒక్కొక్కటిగా మాయమైపోయాయి. స్వయం సమృద్ధంగా వెలుగొందిన సేద్యగాడు ఇప్పుడు అన్నిటికీ ఆధారపడాల్సిన స్థితిలోకి దిగజారాడు. వ్యవసాయ కార్మికులకేమో అవసరమైనన్ని పనులు లేకుండా పోయాయి. అదే సమయంలో రైతుకు అవసరమైనప్పుడు కూలీలు కరువై పోతున్నారు. ఇదొక విచిత్ర పరిస్థితి! బంధాలు తెగిపోయిన గ్రామీణ బతుకు వైచిత్రి!

మారుతూనే ఉంటుంది!

ఊరు మారింది. ఇంకా మారుతుంది. మారుతూనే ఉంటుంది. ఇది సహజం. అవసరం. అయితే, ఆ మార్పు కొత్త సమస్యలను, సంక్షోభాలను సృష్టించకుండా మనం జాగ్రత్త పడాలి. అభివృద్ధికి ఇంధనంగా డబ్బు అవసరమే కానీ, దానికోసం మన మౌలిక స్వభావాలనూ, మాతృక లక్షణాలనూ బలి పెట్టకూడదు. ఊరికీ, దేశానికీ వెన్నెముక వ్యవసాయమే! అయితే, వ్యవసాయానికీ, ఇతర రంగాలకూ సమతుల్యత ఎప్పుడో దెబ్బతినిపోయింది. దానికి తగిన చికిత్స చేసి, సరైన దారిలో పెట్టగలిగితే- మారిన ఊరు అందరికీ ఆనందం కలిగిస్తుంది! దేశం ఎదుర్కొంటున్న అనేకనేక సమస్యలకు పరిష్కారమూ చెబుతుంది! ★

చేపల పచ్చడి

కావలసిన పదార్థాలు

ఒక కిలో చేపముక్కలు. రెండు కప్పులు వెజిటబుల్ లేదా మరేదైనా వంట నూనె ఒక్కటిన్నర కిలోలు ఉల్లిపాయలు, 100 గ్రాములు అల్లం తురుము, 200 గ్రాములు వెల్లుల్లి, 15 పచ్చిమిరపకాయలు, రెండు టేబుల్ స్పూన్లు కారం, ఆరు టేబుల్ స్పూన్ల ధనియాల పొడి, రెండు టేబుల్ స్పూన్లు మిరియాలు, యాలకుల పొడి, ఒక టీస్పూన్ మెంతిపిండి, ఒక లీటర్ వైట్ వెనిగర్, 2-3 వెల్లుల్లి రేకలు (అలంకరణకు)(నానబెట్టడానికి : ఒక టీస్పూన్ పసుపు, ఒక టేబుల్ స్పూన్ కారం, రుచికి ఉప్పు)

తయారు చేసే పద్ధతి

చేపల్ని అరంగుళం ముక్కలుగా కట్ చేసుకోవాలి. పసుపు, కారం, ఉప్పు పట్టించి పక్కన వుంచుకోవాలి. ఉల్లిపాయ ముక్కల్ని నూనెలో బంగారు రంగు వచ్చేవరకు క్రిస్పీగా వేయించి పక్కన వుంచుకోవాలి. అల్లం, వెల్లుల్లి పచ్చిమిరపకాయ ముక్కలనూ పొడిపొడిగా అయ్యేంతవరకు వేయించుకోవాలి.

చేపల ముక్కల్ని ఓ మాదిరిగా వేయించాలి. మిగతా నూనెలో కారం, ధనియాల పొడి, మిరియాల పొడి, మెంతి పిండి, చేపలు వేసి ముక్కలు క్రిస్పీగా అయ్యేంతవరకు వేయించాలి. వేయించిన ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లి, పచ్చిమిరపకాయ ముక్కలు వేసి కలియబెట్టాలి. ఈ మిశ్రమానికి వెనిగర్ జత చేసి సన్నని సెగపై ఉడకనివ్వాలి. చాలినంత ఉప్పు కలపాలి.

చేపల ముక్కలు చెదరకుండా వేయించాలి. చిక్క బడేవరకు వుంచి సెగ తీసేయాలి. మూతపెట్టి అలాగే వుంచి, మసాలాలు, ఉప్పు సరిపోయాయేమో చూసుకుని, అవసరం అయితే కలుపుకోవాలి.

చల్లారాక గాజు సీసాలోకి తీసుకుని పైన వెల్లుల్లి రేకలు వేసుకోవాలి. వారం రోజులు బయటే వుంచి తర్వాత ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. వాడే ముందు అవసరమైనంత వరకు తీసుకుంటూ వుండాలి.



జొన్న రొట్టె

కావాల్సిన పదార్థాలు

రెండు కప్పులు జొన్నపిండి, రెండు ఉల్లికాడలు (తరిగినవి), రెండు పచ్చిమిరపకాయలు (తరిగినవి) రెండు టేబుల్ స్పూన్లు నూనె, ఉప్పు.

తయారు చేసే పద్ధతి

పదార్థాలన్నింటినీ పాత్రలో వేసి, గోరువెచ్చని నీటితో పిండి కలుపుకోవాలి. కలిపిన పిండి మీద మూతపెట్టి పదినిముషాలు పక్కన వుంచుకోవాలి. పిండిని నాలుగు భాగాలుగా విభజించి చపాతీలా చేత్తో తట్టి పెనంపై నూనె రాసి రెండువైపులా రొట్టెను కాల్చుకోవాలి. ఏదైనా కూర నంజుకుని తినాలి.

పప్పు కూర

కావాల్సిన పదార్థాలు

మూడోవంతు కప్పు కందిపప్పు, మూడోవంతు కప్పు మసూర్‌పప్పు, అర టీస్పూన్ ఆవాలు, అర టీస్పూన్ జీలకర్ర, కరివేపాకు, పావుస్పూన్ ఇంగువ. ఒక పచ్చిమిరపకాయ, ఒక ఉల్లిపాయ, రెండు టీ స్పూన్లు అల్లం - పచ్చిమిరపకాయ పేస్ట్, అర టీస్పూన్ వెల్లుల్లి పేస్ట్, ఒక టమాటా, అర టీస్పూన్ కారం, అర టీస్పూన్ పసుపు.

ఒక కప్పు కూరగాయల ముక్కలు (క్యాప్సికం, క్యారెట్, బరాణీ) ఒక టేబుల్ స్పూన్ నూనె, రెండు కప్పుల నీరు, రుచికి కొంత ఉప్పు, కొత్తిమీర.

తయారుచేసే పద్ధతి

పప్పులు కడిగి, రెండుకప్పులు నీరు పోసి కుక్కర్‌లో ఉడికించాలి. మూకుడులో నూనె వేడిచేసి ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడిన తర్వాత కరివేపాకు, ఇంగువ వేసుకోవాలి. పచ్చిమిరపకాయ, ఉల్లిపాయ ముక్కలు కలిపి 3-4 నిముషాలు వేగనివ్వాలి.

అల్లం పచ్చిమిరపకాయ పేస్ట్, వెల్లుల్లి పేస్టు, టమాటా ముక్కలేసి మరో మూడు నాలుగు నిముషాలు ఉడికించాలి. కారం, పసుపు, కూరగాయల ముక్కలేసి కలియబెట్టాలి. పప్పులు, ఉప్పు కలిపి పది నిముషాలు ఉడికించి, కొత్తిమీర జల్లాలి.



మామిడి.. రొయ్యల కూర

కావాల్సిన పదార్థాలు

రెండున్నర కిలోలు రొయ్యలు, 1.2 కేజీలు పచ్చి మామిడికాయలు, 450 మి.లీ రిఫైండ్ ఆయిల్, రెండు టీస్పూన్లు ఆవాలు, రెండు టీస్పూన్లు మెంతులు, 800 గ్రాములు ఉల్లిపాయలు, 150 గ్రాములు వెల్లుల్లి రేకలు, రెండు టీస్పూన్లు కరివేపాకు, ఎనిమిది పచ్చిమిరపకాయలు, 12 టీస్పూన్లు అల్లం - వెల్లుల్లి పేస్ట్, ఒక టీస్పూన్ పసుపు, 80 గ్రాములు కారం, 80 గ్రాములు ధనియాల పొడి, 400 గ్రాములు కొబ్బరి పేస్ట్, 800 గ్రాములు టొమేటో గుజ్జు, రుచికి ఉప్పు, 80 గ్రాములు కొత్తిమీర. (రొయ్యలు నానబెట్టేందుకు : నాలుగు టీస్పూన్లు నిమ్మరసం, అర టీస్పూన్ పసుపు, రుచికి ఉప్పు.)

తయారు చేసే పద్ధతి

నిమ్మరసం, పసుపు, ఉప్పు పట్టించి రొయ్యల్ని నానబెట్టాలి. మామిడికాయల్ని రొయ్యలకంటే చిన్నగా ముక్కలు కోసుకోవాలి. నూనె వేడి చేసి ఆవాలు, ఉల్లి, వెల్లుల్లి ముక్కలు మెంతులు, కరివేపాకు, పచ్చి మిరపకాయలు వేసి వేయించాలి. అల్లం-వెల్లుల్లి పేస్ట్, పసుపు, కారం, ధనియాల పొడి వేసి, ఇంకొద్దిసేపు వుంచాలి. కొబ్బరిపేస్ట్ టొమేటో గుజ్జు వేసి ఉడకనివ్వాలి. నీరు, ఉప్పు కలపాలి. మామిడికాయ ముక్కలు వేసి, గ్రేవి చిక్కబడే వరకు వుంచాలి. నానబెట్టిన రొయ్యల్ని కలపాలి. కొత్తిమీరతో అలంకరించి వేడిగా తినాలి.

కథ

అగరు ధూపం

- కర్లపాలెం హనుమంతరావు

ఆఫీసు నుంచి రాగానే కాఫీతో పాటు ఉత్తరం అందించింది శ్రీమతి. కార్డు రేటు పదిహేను పైసలున్నప్పటి కాలం నాటి ఉత్తరం అది. రమణమ్మత్తయ్యది. ఒకసారి అర్జంటుగా వచ్చి పొమ్మని ఎవరిచేతో రాయించింది. బేరింగు పడిందని మా ఆవిడ ఏడుపు. వివరంగా ఓ ఇన్‌లాండు ఉత్తరం రాయించుకోవచ్చుగా! పిసినారి తనం కాకపోతే!... పోయేటప్పుడు అంతా మూట కట్టుకుని పోతుందికామోసు..." అంటూ అక్కసు.

ఆ మధ్య తిరుపతి పోతూ రమణమ్మత్తయ్య ఇక్కడ దిగింది. వెళ్లే ముందు నా చేతిలో ఒక డిపాజిట్ రసీదు పెట్టి దాచమంది. యాభైవేల బాండది. గడువుకింకా మూడు నెలలుంది.

కొడుకుల చేతిలో పెట్టకుండా ఇక్కడెందుకు దాచమందో అర్థంకాలేదు. అడిగితే బాగుండదని వూరుకున్నా.

"బ్యాకుంలో వడ్డీ మరీ తక్కువగా వుందిరా అబ్బాయ్! ఎక్కువ వడ్డీ వచ్చేదేమైనా వుంటే చూడు.. అక్కడే వేద్దాం!" అంది.

మా ఆవిడ ఊరుకోకూడదూ..! "ఆ ఎక్కువ వడ్డీ మేమే ఇస్తాం. మాకివ్వండి పిన్నిగారూ!" అనేసింది. అంతే.. రమణమ్మత్తయ్య కోపం చూడాలింక!

"అందరికీ నాడబ్బు మీదే కన్ను. నేనేమన్నా అంత ఎతిమతం దాన్లా కనిపిస్తున్నానా" అన్నట్లు మాట్లాడింది.

ఆవిడ ధోరణి నాకు తెలుసుగనక నేనేమీ మాట్లాడలేదుగానీ మా ఆవిడ మాత్రం చాలా బాధపడింది. అందుకే నేను వూరికి బైలుదేరేటప్పుడు ముభావంగా ఉంది. అయినా తప్పదు. రమణమ్మత్తయ్యకూ నాకూ ఉన్న సంబంధం అటువంటిది.

రమణమ్మత్తయ్య నాకు సొంత మేనత్త కాదు మా నాన్న సవతి తల్లి కూతురు అయినా ఇద్దరూ సొంత అన్నచెల్లెళ్ళ కన్నా అభిమానంగా ఉండేవాళ్లు. నల్లగా పొట్టిగా గుమ్మటం లాగా ఉంటుంది. రమణమ్మత్తయ్య మొగుడు పుష్కరాలకని పోయి కృష్ణలో కొట్టుకు పోయేనాటికి నట్టింట్లో నలుగురు పసికూనలు. వాళ్ళను ఆవిడ సాకిన తీరు వర్ణనాతీతం. తినటానికి ఉండటానికి కరువు లేదు. తల్లివైపు నుంచి ఆస్తి వచ్చిందావిడకి. మొగ దిక్కులేని సంసారం. చేతిలో దమ్మిడీ లేకపోతే సంసారం బజార్నపడదా? అని ఆడభయం.

ఊళ్లో వాళ్ళకి వడ్డీకి అప్పులిచ్చేది. వసూళ్ల విషయంలో పరమ నిక్కచ్చి. 'రమణమ్మ! అమ్మో.. కాబూలీ వాలా నయం' అన్న పేరు తెచ్చుకుంది. ఆమె గయ్యాళితనమూ, పిసినారితనమే ఒకరకంగా ఆ సంసారాన్ని ఆదుకుందారోజుల్లో! ఒంటి మీదెప్పుడూ ఒకటే నీరుకావిరంగు చీరుండేది. ఖర్చని తలకు నూనెకూడా సరిగ్గా రాసుకునేది కాదు. ముప్పయ్యేళ్ళకే యాభైయేళ్ల ముసలమ్మలాగుండేది. పిల్లల్ని మాత్రం పువ్వుల్లాగా తీర్చిదిద్దేది. ఇంటినీ అంతే!

పిల్లలకు రకరకాల డ్రెస్సులు వేసేది. రంగురంగుల ముగ్గులు ముంగిట్లో తీర్చిదిద్దేది. ఆవిడకొచ్చినన్ని పిండివంటలు మా అమ్మకూడా రావని మా నాన్న దెప్పుతుండేవాడు. అయితే ఆ చేసినవేమీ బైటవాళ్ళకు పెట్టేది కాదు. తన పిల్లలకు జిలేబీ చేతిలోపెట్టి ఎదురుగావున్న మాకు దొడ్లోని జామకాయలు ముక్కలుగా కోసి పెట్టేది. మాకనేంటిలే.. తనూ తినేదికాదు. జామచెట్టునెక్కడ చూసినా రమణమ్మత్తయ్య గుర్తుకొస్తుంది.

"అందరికిలాగా కోరికలు తీర్చేందుకు పిల్లలకు తండ్రి లేడుగదా.. ఇక నా సంగతంటావా. ఈ పిల్లలు సక్రమంగా పెరిగితే నాకిదే కోటివేలు" అంటుండేది మానాన్న లాంటి వాళ్లెవరైనా ఎప్పుడైనా ఆ పిసినారితనానికి మందలించటానికి పూనుకుంటే!

అన్నట్లు రమణమ్మత్తయ్య కథలు బాగా చెపుతుంది. భానుమతిలాగా కమ్మగా పాడుతుంది. మా ఇంటి రేడియోలో నుంచి వచ్చే పాటలకు ఆవిడ గొంతు కలిపి పాడుతుంటే వినటానికి చాలా హాయిగా వుండేది. సంగీతమన్నా హిందీ అన్నా ప్రాణం. అస్తమానం పిల్లల్ని హిందీ చదవమని సతాయించేది. రెండో కూతురుని హిందీలో విశారద దాకా చేయించింది. ఆ అమ్మాయి ఒక హైస్కూల్లో హిందీ టీచరుగా చేరి ఒక క్రిస్టియనతన్ని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. అది వేరే కథ.

"కృష్ణాష్టమికి ఎన్ని రోజులుందండీ?" అనడుగుతున్నారు బస్సులో ఎవరో. ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చిపడ్డాను. బస్సు ఒంగోలు పొలిమేరల్లోకొస్తుంది.

కృష్ణాష్టమి పేరు వినంగానే మళ్లీ మా రమణమ్మత్తయ్యే గుర్తుకొచ్చింది. ఆ పండుగ రోజు అత్తయ్య శిబిచక్రవర్తి చెల్లెలు అవతారమెత్తేది. కన్నయ్య పుట్టిన రోజు సందడంతా అత్తయ్య ఇంట్లోనే!

ఇంటి నిండా ముగ్గులు వేసేది. కృష్ణ పాదాలను పూజగదిలో నుంచీ వీధిమెట్ల దాకా గుర్తులు పెట్టేది. చీకటి పడేలోగా చిన్ని కృష్ణయ్య ఆ గుర్తులు మీద తన పాదాలు మోపుతూ ఇంట్లో కొస్తాడని ఆమె నమ్మకం. కృష్ణుడికిష్టమని వెన్నతో చేసిన ఉండలు తయారుగా వుంచేది. ఆ రోజు ఆవిడ చేసే ప్రసాదం, పాయసం, నేతి గారెలు తిని చూడాల్సిందే! రాత్రిపూజ పూర్తయిన తరువాత "అదిగదిగో కృష్ణయ్య వచ్చివెళ్లాడు. అడుగుల గుర్తులు కనిపించటం లేదూ?!" అడిగేది మమ్మల్ని. కనిపించటం లేదన్నాడని ఒకసారి మా సుబ్బరాజుని అప్పటి దాకా తిన్న అప్పచ్చులన్నీ కక్కేదాకా చీవాట్లు పెట్టింది. ఆవిడ నోటికి జడిసి "అవునవును.. కృష్ణుడు వచ్చాడు. అదిగో పాదాలగుర్తులు" అనేవాళ్ళం మేం.

మరి ఆవిడ భక్తి అలాంటిది. పెద్దవాడికి కృష్ణమూర్తనీ రెండోవాడికి వాసుదేవమూర్తనీ, ఆడపిల్లలకు శ్యామల, రుక్మిణి అని పేర్లు పెట్టుకుంది. రుక్మిణి ఆ పేరుని సార్థకం చేసుకోటానికన్నట్లు ప్రేమించినవాడిని పెళ్లి చేసుకునేటందుకు ఇల్లు విడిచి వెళ్లిపోయింది.

బస్సు చీరాల చేరేసరికి దాదాపు తెల్లారిపోయింది. ఏదో ఊళ్లో ఆగి, మళ్లీ బయలుదేరే సమయానికి బస్సెక్కుతూ కనిపించాడు సుబ్బరాజు. "అనుకుంటూనే ఉన్నా..

నువ్వివాళో రేపో దిగుతావని" అన్నాడు నా వంక అదోలా చూసి నవ్వుతూ. నా పక్క ఖాళీ వుంటే వచ్చి కూర్చున్నాడు.

సుబ్బరాజు నా క్లాస్‌మేట్ వాళ్ల నాయన. రమణమ్మత్తయ్య పొలం కౌలుకు చేసేవాడు. ఆ తరువాత్తరువాత ఊరికి ప్రెసిడెంటయ్యాడు. వీడు వాళ్ల నాన్న అడుగుజాడలలోనే నడుస్తున్నాడు. ప్రస్తుతానికి ఊళ్లో ఓ గీతా మందిరం కట్టించేపనిలో బిజీగా వున్నాట్ట! "మీ రమణమ్మత్తయ్యను ఒప్పించి భూరి విరాళం ఇప్పించాలిరా! నీ మాటంటే ఆవిడకు మంచివారంటగా... పెద్దావిడ పేరు ఫలకం మీద చెక్కిద్దాంలే!" అన్నాడు.

"నువ్వే అడక్కపోయావా? కృష్ణుడి పేరు చెబితే ఆవిడ కాదనదే.." అన్నాను నేను.

"ఆవిడకు అనుమానాలు జాస్తిరా బాబూ! అందరూ ఆవిడ ఆస్తిని కాజేయటానికే కూర్చున్నారనుకుంటుంది. అందుకే బాగా అయింది శాస్తి" అన్నాడు. "ఏమయిందీ?"

"నీకు తెలీదా? అందుకే వస్తున్నావనుకున్నా ఇంకా. ఆవిడకు క్యాన్సరంటగా.. లంగ్ క్యాన్సర్. బాగా ముదిరిన తరువాత బైటపడ్డట్లుంది. పోయే లోపల తన చేత భారీ విరాళం ఇప్పించే పూచీ నీదే."

"రమణమ్మత్తయ్యకు క్యాన్సరని నాకు తెలీదు. మా ఊరొచ్చినప్పుడు బాగానే ఉందే!

"మీ ఊరొచ్చిందా?" అని ఆశ్చర్యపోయాడు సుబ్బరాజు. నా దగ్గర బాండు దాచినట్లు కూడా తెలీదు వీళ్లకు. బహుశా దాని కోసమే నాకు కబురు పంపిచినట్లుంది. బాండ్ వెంట తీసుకురావటం మంచిదయింది.

"క్యాన్సరొస్తే పల్లెటూళ్లో ఏం చేస్తుంది? ట్రీట్‌మెంట్ తీసుకోదా?" అనడిగా. డబ్బు ఖర్చని వద్దందిట. ఊళ్లో ఆచార్లే ఏదో మందిస్తున్నాడు. పెద్దాడు అలిగి వేరే కాపురం పెట్టాడు. వాసు స్టేట్సులో ఉంటున్నాడాయ! పెద్దల్లుడు మంచాడు కాదంటారు. రెండో పిల్లని దగ్గరకు రానివ్వదు. అన్నాడు సుబ్బరాజు.

పిల్లల్ని పూల చెట్ల మాదిరి సాకింది. గారాబంతో పెద్దాడు చెడ్డాడు. రెండోవాడు అందకుండా పోయాడు. ఆడపిల్లలెప్పుడూ ఆడపిల్లలేగా!

ఇంటికెళ్లి చూశాక రమణమ్మత్తయ్య పరిస్థితికి జాలేసింది. లంకంత ఇంట్లో పని పిల్లను పెట్టుకుని ఒంటరిగా నెట్టుకొస్తుంది.

క్యాన్సరు తెచ్చిన మార్పు కనిపిస్తూనే ఉంది. వేదాంతం బాగా వంటబట్టింది. "ముందునుంచీ నాకు ఈ పిల్లలు తోడు లేరుగా! నా కన్నయ్యే నా వెన్నంటి ఉండి నడిపించాడు. ఆ చల్లనయ్య చల్లంగా చూస్తే చాలు.." అంది మంచంలోనుంచే.

అంత పెద్ద సంసారాన్ని అతిపిన్న వయసులోనే సునాయాసంగా ఈదిన అత్తయ్యకు ఇలా చివరిరోజుల్లో అయిన వాళ్ల అండలేక పోవటం చూసి నాకు చాలా కష్టం వేసింది.

"మద్రాసు రారాదూ! మంచి డాక్టరుకు చూపించుకుందువుగానీ.." అన్నాను. నవ్వి వూరుకుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ రసీదు బైటికి తీశాను. పడుతూలేస్తూ వచ్చి బ్యాంకులో బాండ్ మార్చుకుంది. ఇంక నేను వెళతానంటే "ఈ ఒక్క రాత్రికీ ఉండి పోరా రాముడూ!" అంది. ఆ రాత్రి ఎగశ్వాస.. దిగశ్వాస. ఆచారొచ్చి చూసి "రాత్రి గడవటం కష్టం" అన్నాడు. అందరికీ కబుర్లు వెళ్లాయి. అమెరికాలో ఉన్న వాసు "రావటం లేటవుతుంది. అవసరమైతే అన్నయ్యనే అన్నీ కానిచ్చెయ్యమను బావా!" అన్నాడు ఫోనులో.

పెద్దాడు వచ్చాడు కానీ కదలకుండా ఒక మూల కూర్చున్నాడు. పలకరించబోతే తల తిప్పేసుకున్నాడు. నేనేదో వాళ్లమ్మని కాకాపట్టి ఆస్తి కొట్టేయాలని వచ్చినట్లు ఒకళ్లిద్దరితో అనటం నా చెవిన బడింది. నేనేం మాట్లాడలా. ఆ గొడవలకిది సందర్భమా?!

పెద్ద కూతురు వచ్చీ రాగానే ఇంట్లో సామానుల గురించి ఆరాలు మొదలు పెట్టింది. రెండో అమ్మాయి కనిపించలేదు. ఆ అమ్మాయిని చేసుకున్న క్రిస్టియన్ కుర్రాడు మాత్రం ఒకసారి వచ్చి వెళ్లాడు. పని పిల్లను కుదిర్చింది అతనేనట! అతనేదో ఎన్జీవో సంస్థలో వార్డెన్‌గా ఉన్నాడన్నారు. మొత్తానికి రమణమ్మత్తయ్య చివరి శ్వాస తీసుకొనే వేళకి వాసు తప్ప అందరూ పక్కనే ఉన్నారు. రెండో కూతురు చివరి చూపుకొచ్చింది. కొంత నయం. కానీ ఆ తరువాత జరిగిన సంఘటనలే చికాకు పుట్టించేవిగా ఉన్నాయి.

"అమ్మ నాకొక్క దమ్మిడీ ఇవ్వలేదు. కర్మకాండలు జరిపించటమెట్లా?" అన్నాడు పెద్ద కొడుకు. "పెద్దకొడుకుగా అన్నీ చేయడం నీధర్మం" అని పెద్దకూతురూ పెద్దల్లుడూ!

సుబ్బరాజొచ్చిందాకా చర్చలలా సాగుతూనే వున్నాయి. "బ్యాంక్‌లో నిన్ననే బాండు మార్చుకుందిటగా మరాడబ్బులేమైనాయి?" అని వాడి ఆరాటం.

ఆఖరికి తను దాచుకున్న సొమ్ముతోనే అత్తయ్యను కాటికి పంపే ఏర్పాట్లు చెయ్యటానికి తీర్మానమయింది. ఆ డబ్బే లేకపోతే రమణమ్మత్తయ్య పని ఏమయివుండేదో?! జీవితాంతం పిసినిగొట్టుగా బతికింది. కాట్లో కట్టెల ఖర్చు కోసమే అన్నట్లయిందామె పరిస్థితి. కర్మకాండలు ముగిసిన వెంటనే నేనూ బైలు దేరాను.

"ఇంతకాలం ఉన్నావ్. ఇంకొక్క పూట ఓపిక పట్టు. మీ రమణమ్మత్తయ్యేదో వీలునామా రాయించిందంట! బ్యాంకులో ఉంది. పట్టుకొస్తున్నారు. గీతామందిరానికే మాత్రం రాసిందో విందువుగానీ!" అన్నాడు సుబ్బరాజు కులాసాగా. నాకేదో అనుమానం మొదలయింది. నడవాలో రమణమ్మత్తయ్య పటం ముందు కూర్చున్నారందరూ. పని పిల్ల గుప్పెడు అగరుబత్తులు తెచ్చి వెలిగించి పోయింది.

అగరు దీపం మెల్లిగా హాలంతా వ్యాపిస్తుంటే అదొకరకమైన అనుభూతి. ఈ ఇంట్లో ఈ ప్రశాంతత ఎల్లకాలమూ ఇలాగే కొనసాగితే బాగుణ్ణు! ఈ ఆస్తి పంపకాల తరువాతైనా అత్తయ్య ఆత్మకు శాంతి లభిస్తుందా?మెల్లిగా అక్కడనుంచీ తప్పుకుని దొడ్లో జామచెట్టు కింద కుర్చీ వేసుక్కూర్చున్నాను. చెట్టు నిండా చిలక్కొట్టిన పళ్లు చాలా ఉన్నాయి. వగరు కాయలకోసం పిల్లలు కొట్టుకుంటున్నారు. జామచెట్టును చూస్తే రమణమ్మత్తయ్యే గుర్తుకొస్తుంది. లోపట్నించీ ఏవో గోలగా మాటలు వినిపిస్తున్నాయి.

"అమ్మ మీకీ ఉత్తరమియ్యమందయ్యా!" అంటూ ఒక కవరు ఇచ్చిపోయింది పనిపిల్ల.

కవరు తెరిచి కాగితం మడతలు విప్పాను. అత్తయ్య ఎవరి చేతో రాయించిన ఉత్తరం అది.. "ఇది నా స్వార్జితమైన ఆస్తి. కొంత మా అమ్మవైపు నుంచి వచ్చినా నా ఇష్టం వచ్చినట్లు పంచుకునే అధికారం ఉందని లాయరుగారు అన్నారు. నా పిల్లలకు చాలా ప్రేమనురాగాలు పంచి ఇచ్చాను. వడ్డీతో సహా అసలు కూడా వసూలయితేగానీ.. మళ్లీ అప్పిచ్చే అలవాటు లేనిదాన్ని నేను. నా కన్నవాళ్లింకా నా రుణం తీర్చుకోలేదు. కనక మళ్లీ వాళ్లకేమీ ఇవ్వలేను. ప్రతి కృష్ణాష్టమి రోజూ కన్నయ్య నా కోసం నా ఇంటి కొస్తుంటాడు. ఈ సారి వచ్చినప్పుడు నేను లేకపోతే దిగులు పడతాడేమో! అది నేను భరించలేను రాముడూ! అందుకే నేనొక నిర్ణయం తీసుకున్నానురా! ఈసారి కృష్ణాష్టమికి కన్నయ్య నా ఇంటికొచ్చే వేళకి నట్టింట్లో నేను లేకపోయినా.. నాలాంటి వాళ్లెవరైనా ఉండాలి. కన్నబిడ్డల ప్రేమనురాగాలకు దూరమై పరితపించే నాలాంటి తల్లులు.. తండ్రులూ దేశంలో కోకొల్లలు. అందులోని కొంత మందికైనా నా ఇల్లు ఆశ్రయమైతే చాలు. నాలాంటి వృద్ధులను సాకాలంటే మాటలా? ఎంతో ఓపిక.. సహనం కావాలి. సేవాభావం ఉండాలి. ఈ రెండూ నా చిన్నల్లుడి దగ్గర దండిగా ఉన్నాయి. అతణ్ణి ఒప్పించి ఈ వృద్ధాశ్రమాన్ని నిర్వహించేలా చూసే బాధ్యత నీదేరా రాముడూ! ఆశ్రమ నిర్వహణగ్గానూ నా దగ్గరున్న ఆస్తి బొటాబొటిగా సరిపోతుంది. సుబ్బరాజు గీతామందిరానికి ఇచ్చేందుక్కూడా ఇంకా ఏమీ మిగల్లేదు..."

లోపలినుంచి అరుపులు పెద్దవయ్యాయి. సుబ్బరాజు భుజాన కండువా వేసుకుని విసురుగా బైటికి వెళ్లిపోయాడు. ఆ వెనకనే మిగిలిన వాళ్లు ధుమధుమలాడుతూ! గంటలో ఇల్లంతా ఖాళీ అయింది. లోపలికి తొంగి చూస్తే రమణమ్మత్తయ్య ఫోటో ముందున్న అగరొత్తుల ధూపం పరిమళం గదంతా మెల్లగా అల్లుకుంటోంది. అది గది కాదిప్పుడు.. వృద్ధాశ్రమం.. అదే గీతా మందిరం...

★

వికాసం



ఈ ఏడాది మీదే కావాలంటే...

మనకున్న సమయం ఎంత? దాన్ని ఎలా వినియోగించుకుంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది? గత ఏడాదికి సంబంధించిన వీక్షణను పూర్తి చేసిన తర్వాత దాన్నుంచి నేర్చుకోవలసిన అంశాలు... తీసుకోవలసిన పాఠాలూ ఇందుకు మొదటి ప్రాతిపదిక అయితే రానున్న కాలంలో ఎదురయ్యే పరిస్థితుల గురించిన అంచనాలు ప్రణాళికకు ప్రాథమిక వనరు. వాటి ఆధారంగా వాస్తవికమైన దృష్టితో ఏం చేయాలి ఎలా వ్యవహరించాలి అన్నది రేఖామాత్రంగానైనా అనుకోవడం అవసరం.

\- తెలకపల్లి రవి

ముందుగా తీసుకోవలసినవి. గతంలో అసంపూర్ణంగా మిగిలిన అవసరమైన పనులు. అవి అనవసరమైతే పూర్తిగా వదిలేయవచ్చు గాని అర్ధంతరంగా అనిశ్చితంగా కొనసాగనివ్వకూడదు. కొద్ది కృషిచేస్తే పూర్తయి సత్ఫలితాలిచ్చే వాటిని మున్ముందుగా పూర్తి చేయాలి. ఉదాహరణకు ఏదైనా కట్టడం దాదాపు పూర్తయి కొద్దిగా మిగిలివుండొచ్చు. ఏదైనా పుస్తకం దాదాపు పూర్తయి కొన్ని పేజీలు మిగిలి వుండొచ్చు. ఏదైనా చెల్లింపు కొద్దిలో మిగిలి వుండొచ్చు. ఇలాంటివి ముందుగా పూర్తి చేస్తే ప్రయోజనం కలగడమే గాక మెదడు కూడా ఆ మేరకు తేలికవుతుంది. పూర్తి చేస్తే ప్రయోజనం కలగడం అటుంచి చేయకపోతే నష్టం కలిగించే పనులు కూడా వుంటాయి. ఉదాహరణకు ఏదైనా మరికొంత మొత్తం కడితే ఒక రుణం తీరిపోయి వడ్డీ మిగులుతుంది. లేకపోతే కొన్నిసార్లు ఆ కాస్త కట్టకపోవడం వల్ల కట్టింది కూడా వ్యర్థమవుతుంది అనుకుందాం.అలాటి వాటిని ప్రప్రథమంగా పూర్తి చేసేయాలి. ఇదే కోవలో పూర్తి కాకపోవడం వల్ల ఇతరులను ఇబ్బంది పెట్టేవి, బాధ కలిగించేవి కూడా ముందుగా పూర్తి చేసుకోవాలి. ఎలా అయినా చేయకతప్పనివైతే వాటిని కూడా త్వరితంగా పూర్తి చేసుకోవడం మెరుగు.ఆలస్యం చేసుకోవడం వల్ల వొరిగేది వుండకపోగా అసౌకర్యమే మిగులుతుంది. మన వృత్తి ఉద్యోగ వ్యాపారాలు లేదా రంగాలలో మన కృషికి గాని మొత్తం ఆ రంగానికి గాని మేలు చేసే పనులను కూడా ముందుగా చేపట్టాలి.

రంగం ఏదైనా సరే **ఉత్పాదకత**కు పెద్ద పీట వేయవలసి వుంటుంది. సత్ఫలితాలివ్వడమే ఉత్పాదకత అంటే అర్థం. ప్రతిసారీ ఏదైనా ఉత్పత్తి జరిగి తీరాలని కాదు. ఆయా రంగాలను బట్టి దాని వల్ల కలిగే ప్రయోజనమే ఉత్పాదకత. అనాలోచితంగా అనుత్పాదక వ్యవహారాల్లో మునిగితేలే సందర్భాలు చాలా కనిపిస్తుంటాయి. గత సంచికలో అలాంటివి చాలా చెప్పుకున్నాము. అలాంటివి కాకుండా నిజంగా ఉత్పాదకమైన వాటికి ప్రాధాన్యత నివ్వాలి. అంటే మీ అవగాహన పెంచేవి, మీ పెట్టుబడికి దోహదపడేవి. మీకు మానవ వనరులు మరింతగా పెరగడానికి దోహదపడేవి, మీ శ్రమను తగ్గించేవి, కొత్త సమాచారమో సమాధానాలో ఇచ్చేవి ఆర్థిక శక్తిని లేదా జ్ఞానాన్ని పెంచేవి బేరసారాల్లో మీ శక్తికి తోడయ్యేవి, ఆరోగ్యపరంగా మేలు చేసేవి, ఆందోళనను తగ్గించేవి, వేగం పెంచేవి, ఇలాంటి అంశాలకు పెద్ద పీట వేయాలి. ఒక్క ముక్కలో చెప్పాలంటే దీనివల్ల ఫలానా ప్రయోజనం వుంది, ఫలానా అంశం అదనంగా వొనగూడింది అని మీరు భరోసాగా సూటిగా చెప్పగలగాలి. అలాంటివాటికి కూడా ప్రాధాన్యతా క్రమంలో ముందు చోటు కల్పించాలి.

ఉత్పాదకత పెరగాలంటే అవగాహన పెరగాలి. అందుకు ఉపయోగపడే అంశాలను ప్రాధాన్యతగా పెట్టుకోవాలి. అవగాహనను నాలుగు రకాలుగా చెప్పుకోవచ్చు- వైజ్ఞానికం, సాంకేతికం, సామాజికం, రాజకీయం, లౌకికం, సాంస్కృతికం. సాంఘికం.

విజ్ఞానం మానవజాతికి మార్గదర్శి మాత్రమే గాక మన జీవితంలో అణువణువూ దానితో ముడిపడి వుంటుంది. ఆహారం, ఆరోగ్యంతో సహా. ఆ పనులు యాంత్రికంగా పూర్తి చేయడం గాక అవగాహనతో చేయాలంటే విజ్ఞాన శాస్త్ర సంబంధమైన సమచారాన్ని తప్పక తెలుసుకోవాలి. చదవడం, వినడం చూడడం వంటివన్నీ ఈ కోవకు వస్తాయి. వైజ్ఞానిక అవగాహన ఆత్మ విశ్వాసాన్ని పెంచి అపోహలను దూరం చేస్తుంది. వాస్తు, చేతబడులు, శాంతులు వంటి మూఢత్వం పెరగడానికి కారణం విజ్ఞానం పెంచుకోకపోవడమే. కనక వున్నచోటనే వుండకూడదనుకునే వారు తప్పక తమ విజ్ఞాన పరిధిని పెంచుకోవడానికి ప్రాధాన్యతనివ్వాలి

సాంకేతికం అన్నది ఈ రోజున ప్రపంచాన్ని శాసిస్తున్నది. జీవితం సుఖప్రదమూ, సులభమూ కావాలంటే సాంకేతిక పరిజ్ఞానం పరికరాలు తప్పనిసరి. ఇంట్లో స్విచ్ వేయడం దగ్గర నుంచి కార్యాలయంలో ఎస్ఎంఎస్ మెసేజ్ పంపడం వరకూ ఇతరులపై ఆధారపడేట్టయితే అది ఆత్మవిశ్వాసాన్ని అనివార్యంగా దెబ్బ తీస్తుంది. వ్యవసాయం నుంచి వంట చేయడం వరకూ ప్రతిపనిలో ఏదో ఒకనాటి సాంకేతికత దాగి వుంటుంది. పనులు రావని, ఫలానాదానితో సంబంధం లేదని దాటేస్తూ పాత పద్ధతినే పట్టుకు వేళ్లాడ్డం అంటే సమయం సామర్థ్యం కూడా తగ్గించుకోవడమే. ఉదాహరణకు మహానగరంలో బాగా తిరిగే వ్యక్తి స్కూటరు వాడటం అలవాటు లేదని చెప్పడం, రాత ఎక్కువగా చేసే వ్యక్తి కంప్యూటరు వాడటం తెలుసుకోకపోవడం, అన్ని పరికరాలు అందుబాటులో వున్నా వాడకం రాకపోవడం ఇవన్నీ ఆ కోవలోకే వస్తాయి. ఇలాంటి కారణాలు అనివార్యంగా పరాధీనతకు దారి తీస్తాయి. పరిమితులు కల్పిస్తాయి. కొంత స్తోమత వున్నవారు వస్తువులు కొంటుంటారు గాని వినియోగించడం నేర్చుకోరు. కనక వున్నదానికంటే మరింత మెరుగైన అవసరమైన సాంకేతిక అవగాహన పెంచుకోవడం ప్రాధాన్యతల క్రమంలో వుండాలి. వున్నది బాగుంది గనక కొత్తది అవసరం లేదనే వారు ముందు దాన్ని గురించి తెలుసుకుని ఆపైన నిర్ణయించుకోవచ్చు.

సామాజిక సంబంధాలు మనిషిని నడిపిస్తాయి. కుటుంబాలు సంస్థలు పరిసరాలు ఏవైనా సరే. వాటిని పెంచుకోవడం కూడా ప్రాధాన్యత కిందకే వస్తుంది. వంటిగొట్టు రామలింగం లాగా గిరిగీసుకుని కూచుంటే మానవ స్వభావంలో ప్రాథమికాంశమే దెబ్బతినిపోతుంది. అయితే సామాజిక సంబంధాలలో ఏది ఎంత ప్రాధాన్యం అన్నది ఎవరికి వారు నిర్ణయించుకోవాలి. ఈనాటి సమాజంలో కులాన్ని సామాజిక వర్గాన్ని పర్యాయపదాలుగా వాడుతున్నారు గాని అది సరైంది కాదు. కులం గీతలు దాటి అందరినీ ఒకే కుటుంబంగా పరిగణిస్తూ సామాజిక పునాదిని విస్తరించుకోవడానికి ప్రయత్నించాలి. అందుకు తగిన విధంగా కాలాన్ని కేటాయించుకోవాలి. కొన్నిసార్లయినా శుభాశుభ సందర్భాలలో కలవడం ఈ రీత్యా చాలా కీలకం. సామాజిక సందర్భాలను తప్పక వాడుకోవాలి. ఇతరులు సమస్యలలో వుంటే సహాయపడాలి. మనకు అవసరమైతే తీసుకోవాలి. పదిమందిలో కలసి వుండే అవకాశాన్ని ఆహ్వానించాలి. అంతర్ముఖులం గనక అలా వుండనవసరం లేదంటుంటారు గాని అది పూర్తిగా సరికాదు. కావాలంటే అక్కడ కలుపుగోలుగా మాట్లాడ్డంలో అంతర్ముఖులకు బహిర్ముఖులకు తేడా వుండొచ్చు గాని పదిమందితో కలసి వుండాలనే సూత్రానికి మినహాయింపు వుండదు.

రాజకీయ అవగాహన. జీవితంలో ప్రతిదీ ప్రత్యక్షంగా పరోక్షంగా రాజకీయ నిర్ణయాలతో ముడిపడి వుంటాయి. కనక ప్రతివారూ రాజకీయ

అవగాహన పెంచుకోవాలి. వ్యక్తిగతంగానూ రాజకీయ అంచనాలకు రాగలగాలి. చాలా మంది చదువుకున్న వాళ్ల కూడా మాకు రాజకీయాలంటే ఆసక్తి లేదని గొప్పగా చెబుతుంటారు గాని అది హాస్యాస్పదమైంది. ఎవరి రాజకీయ అభిప్రాయాలు వారికి ఉంటాయనుకున్నా ఆ మేరకైనా స్వీయ పరిజ్ఞానం వుండాలి. లేకపోతే మరెవరో చెప్పిన దాన్ని విచక్షణా రహితంగా అనుసరించే పరిస్థితి వస్తుంది.

సాంస్కృతిక సౌందర్య దృష్టి. జీవితంలో తక్కిన అన్ని అంశాలతో పాటు సాంస్కృతిక దృష్టి, సౌందర్య కోణం కూడా వుంటుంది. కొన్ని కుటుంబాలలో ఎంత పేదరికంగా వున్నా కళాదృష్టి మనకు కనిపిస్తుంది. సాంస్కృతిక స్థాయి జీవితాన్ని అర్థవంతంగా చేస్తుంది. సాహిత్యం చదవడం, కళా రూపాలను ఆదరించడం వీలైతే పాల్గొనడం ఇవి ఆహ్వానించదగినవి. వీటివల్ల మానసిక ఉల్లాసం వికాసం కలగడమే గాక జీవితం పట్ల దృక్పథం కూడా విశాలమవుతుంది. ఉత్సాహం పెరుగుతుంది.అయితే దీని అర్థం టీవీకి అతుక్కుపోయి వచ్చినవన్నీ చూస్తూ కాలం వృథా చేయడం కాదు. ఇంటిని పొందికగా తీర్చిదిద్దుకోవడం జీవితం ఒద్దికగా గడపడం పరస్పరం సంబంధం లేని విషయాలు కాదు. ఆదిమానవులు గుహల్లోనే చిత్రాలు వేసి వేటలో, నాట్లలో పాటలు పాడారని గుర్తుచేసుకుంటే ఆధునికులమనుకునేవాళ్లం మరెంత చేయొచ్చు? ముగ్గు వేయడమైనా పేడతో అలకడమైనా ఒక బొమ్మను తెచ్చి పెట్టడమైనా సౌందర్య దృష్టిని చూపిస్తుంది. ఇది ఖర్చుతో ఖరీదుతో ముడిపడినదే కానక్కరలేదు. కళాదృష్టి మనిషిలో ఒకింత ప్రశాంతతకు విశాలత్వానికి కూడా దారి తీసే అవకాశముంటుంది.

తర్ఫీదు ప్రధానం. జీవితం అనే మాట ఏకవచనం కాదు. బహువచనమూ శాశ్వతమూ జీవితం. ఒక్కరే వుంటే ఎలా జీవించారన్నది సమస్య కాదు, అలాగే ఆ ఒక్కరితో ముగిసిపోదు కూడా. కనక తరాలు మారతాయి గాని సమాజం శాశ్వతంగా వుంటుంది. కనక ఏ రంగంలో వారైనా తము చేసే పని ఇతరులకు మరీ ముఖ్యంగా తర్వాతి తరాల వారికి నేర్పడం పనిగా పెట్టుకోవాలి.అదే జరక్కపోతే మానవ నాగరికత ఏనాడో అంతమై వుండేది. ఏదైనా సాధించిన వారు సాధించాలనుకునే వారు తమ తర్వాత ఆ పని చేసే యువతను తర్ఫీదును చేయడం బాధ్యతగా తీసుకోవాలి. ఇంట్లో పిల్లలైనా కార్యాలయాల్లో సహాయకులైనా యువకులైనా ఇది తప్పక జరగాల్సిన పని. వారు అనేక పొరబాట్లు చేయొచ్చు. అపరిపక్వంగా ప్రవర్తించవచ్చు. అయినా సరే భవిష్యత్తును చూసేది వారే అని ప్రతివారూ గుర్తుంచుకోవాలి. తమ కంటే ఏ కాస్త చిన్నవాళ్లనయినా కొత్త వాళ్లనయినా అదో మాదిరి ఆధిపత్య కోణంలో చూసే వారు తరచూ కనిపిస్తుంటారు. ఈ వైఖరి మార్చుకోవడమే గాక వారికి చైతన్య పూర్వకంగా నేర్పించడానికి సిద్ధం కావాలి. యువతకు నేర్పడమే గాక వారి నుంచి నేర్చుకోవడానికి కూడా సిద్ధం కావాలి. ఎందుకంటే కాలంతో కాలంలో వచ్చే మార్పులను అవాహన చేసుకోగల శక్తి వారికి ఎక్కువగా వుంటుంది.

స్నేహం మానవ సంబంధాలలో చాలా విలువైంది. బహుశా ఏ కుటుంబ బంధమూ వ్యవస్థాత్మక అనుబంధమూ లేని మానవీయ స్పృహ స్నేహంలోనే మనకు కనిపిస్తుంది. పురాణ కాలం నుంచి స్నేహంపై చాలా కథలున్నాయి. చరిత్రలోనూ అనేక వాస్తవ గాథలున్నాయి. చలన చిత్రాల్లో వాటిని మరీ నాటకీయంగా చూపించడం ఒకింత నవ్వు తెప్పించినా మానవాళి సృష్టించుకున్న గొప్ప విలువల్లో స్నేహం ఒకటని ఒప్పుకుని తీరాలి. మంచి స్నేహమైతే స్వార్థం వుండదు. అందుకే నిస్వార్థమైన నిజమైన స్నేహితులను ప్రాణ ప్రదంగా కాపాడుకోవాలి. వారితో అపార్థాలను త్వరితంగా తొలగించుకోవాలి. స్నేహితులైన వారు పరస్పర అవగాహనతో సహకారంతో ఉమ్మడి లక్ష్యాలను నెరవేర్చుకోవాలి కూడా. అయితే స్నేహం అన్న భావనను అవాస్తవంగా ఆకాశానికెత్తి అపశ్రుతులకు అనర్థాలకు ఆస్కారమివ్వకూడదు. వాస్తవిక దృక్పథంతోనే దాన్ని కాపాడుకోవాలి.

వినోదం, విరామం ఎంత కష్టపడే వారైనా సరే క్రమ పద్ధతిలో విరామానాకి వినోదానికి అవకాశం అట్టిపెట్టుకోవాలి. వినోదం మనిషికి కొత్త శక్తి నిస్తుంది. ఒక్కసారి నవ్వగలిగితే బోలెడు శ్రమ మటుమాయమై పోతుంది. అయితే అది ఆరోగ్యకరమైన ఆహ్లాద కరమైన హాస్యమై వుండాలి. విరామం మరింత అవసరం. అది శక్తిని పెంచుతుంది కూడా. అలాగని విరామం ఎక్కువైతే విసుగుదలకూ దారి తీస్తుంది. శక్తి సన్నగిల్లిపోతుంది.

ప్రణాళిక ఎలా వుండాలి?

పైన చెప్పుకున్న అంశాలను గమనంలో వుంచుకుని వార్షిక ప్రణాళిక వేసుకోవాలి. వారం ప్రణాళిక కూడా వేసుకోవాలి. గత ఏడాది సమీక్షను ఈ ఏడాది ప్రాధాన్యతలకు దృష్టిలో వుంచుకుని సమయాన్ని విభజించుకోవాలి. అసలు మనకు ఎంత సమయం వుంది? అందులో మన చేతిలో వున్నదెంత? మన ప్రమేయం లేకుండానే తప్పక కేటాయించవలసినదెంత? చూసుకోవాలి. ప్రధానమైన వాటికి చురుగ్గా వుండే సమయాన్ని పెద్ద కేంద్రీకరణ అవసరం లేని వాటికి విసుగు పుట్టే సమయాన్ని కేటాయించుకోవాలి. ఉదాహరణకు ఇంట్లో బట్టలు మడతలేయడం, వూడ్చడం, మీ ఆఫీసు టేబులు తుడవడం వంటి పనులకు పెద్ద కేంద్రీకరణ అవసరం లేదు. యథాలాపంగా చేసేయొచ్చు. వాహనం నడిపేముందు బాగా అలసి పోయారనుకోండి మంచిది కాదు. కలుసుకోవలసిన వారి సమయాలెలా వుంటాయి? మీ కోసం సందర్శకులు ఎప్పుడు వస్తారు? టీవీలో మీరు చూడాలనుకునే కార్యక్రమం ఎప్పుడు వస్తుంది? మీ ఇంటికి పత్రికలు ఏ సమయానికి వస్తాయి? బ్యాంకుల వేళలెలా వుంటాయి ఇవన్నీ మీ సమయ విభజనను ప్రభావితం చేయొచ్చు. నిద్ర లేవడం, పడుకోవడంతో సహా మీ వేళలు నిర్ణీతంగా వుంటే చాలా ప్రయోజనం కలుగుతుంది.

సమయం తర్వాతది డబ్బు. ఇది అందరికీ ఒకే మోతాదులో అందుబాటులో వుండదు. కనక వున్న దాన్నిబట్టి అవసరానుగుణంగా అంచనాలు వేసుకోవాలి. ఏది ఏమైనా ఎంత వున్నా లేకున్నా జమా ఖర్చులు తెలియాలి. **సెల్‌ఫోన్** మాట్లాడేందుకు ఎంత సమయం వెచ్చిస్తున్నారు అన్నది స్పష్టంగా గుర్తించాలి. మనం అవసరమైన వారితో అవసరమైన మేరకు మాట్టాడాలి. **తనిఖీ** మీ పనిపై మీకు తనిఖీ వ్యవస్థ వుండాలి. కుటుంబ సభ్యులకు మిత్రులకు సహచరులకు మీరే ఆ బాధ్యత అప్పగించాలి. విమర్శలు ఆహ్వానిస్తారన్న భరోసా కలిగించాలి. **సంధిగ్ధాలు..** కారణాలేవైనా వ్యక్తులెవరైనా తాము స్పష్టంగా తేల్చుకోలేని విషయాలు గుర్తించాలి. ఆ విషయంలో సంధిగ్ధంగా వున్నామని నిర్ణయించుకోవాలి. లేకపోతే పదే పదే అ విషయం ముందుకొచ్చి సమయం హరిస్తుంటుంది. తక్షణ సమస్యలు కాకపోతే అలాంటి వాటిని కొంత కాలం వాయిదా వేయాలి. కాని సమస్య సంధిగ్ధతను వ్యక్తులకు ఆపాదించకూడదు. లేదా మిమ్మల్ను మీరే తిట్టుకుంటూ కూచోకూడదు.

ఇక ...ఇప్పుడేం చేస్తారు?

కలం, కాగితం తీసుకోండి. పట్టిక రాసుకోండి ♦కొనాల్సినవి ♦ చదవాల్సినవి ♦చూడాల్సినవి ♦ మాట్లాడాల్సినవి ♦చేయాల్సినవి ♦ ముగించాల్సినవి ♦తేలనివి ♦తేల్చవలసినవి ♦ నేర్చుకోవలసినవి♦ మార్చుకోవలసినవి ♦ వాయిదా పడినవి, వాయిదా వేయదగినవి ♦ వదిలించుకోవలసినవి ♦ నిలబెట్టుకోవలసినవి ♦ స్పష్టం కావల్సినవి ♦ మీరు ప్రోత్సహించవలసిన వారు ♦ మనం సలహాలు తీసుకోదగిన వారు, మీ సహాయం అవసరమైన వారు, నిరర్థక సమయాపహారులు ♦ మూఢ నమ్మకాలు, సాంకేతిక మెరుగుదల, కళా సాంస్కృతికాంశాలు, వినోదం ఇచ్చే విషయాలు, సామాజిక కార్యక్రమాలు, వృత్తి నైపుణ్యాలు, మానవ సంబంధాలు, వెళ్లవలసిన ప్రదేశాలు.. ఈ జాబితాలో మీరు ఏం రాసుకున్నా అందుకు వ్యవధి ఏమిటో ఎప్పుడో వ్యయప్రయాస లేమిటో కూడా ప్రాథమికంగా ఆలోచించుకోండి. అంతిమ రూపం వచ్చే సరికి ఏమైనా మార్పులు వుండొచ్చు గాని బీజ ప్రాయమైన ఆలోచన తప్పక వుండాలి. ఇందులో మీరు రాసుకునేదేదైనా మీ లవగాహన కోసమే తప్ప బహిరంగ ప్రచారం కోసం కాదు. ప్రతివారూ వెనువెంటనే మీతో ఏకీభవించనవసరం లేదు. వారు వద్దంటే మీరు బాధపడాల్సిన పనీ లేదు. ప్రణాళిక అంటూ వుంటే దాన్ని సందర్భాన్ని బట్టి పట్టువిడుపులతో అమలు చేసుకోవచ్చు. కాకపోతే గత అనుభవాలను గమనంలో పెట్టుకుని వాస్తవికంగా నిర్ణయించుకోండి. కలుగుతున్న అనుభవాలను బట్టి మార్పులు చేర్పులు చేసుకుంటూ పురోగమించండి!

2011 అక్షరాలా మీదే కావచ్చు!

★

నేర్చుకుందామా!

హాయ్... మీకు కేకంటే ఇష్టం కదా. పైగా కొత్త సంవత్సరం, క్రిస్టమస్ అంటే కేకు లేకుండా ఎలా? అందుకే మీకోసం కేక్ తీసుకొచ్చామర్రా. మరి బాగా నేర్చుకుని గీసేయండి.





కవలలు ఎవరోచ్!

నేస్తాలూ! ఈ బొమ్మల్లో అమ్మాయిలంతా చూడ్డానికి ఒకేలా వున్నారుకదూ. వీళ్లు ఒక ఎలుక పిల్లను చూసి దడుచుకొని ఇలా భయపడిపోయార్రా. అయితే తమాషా ఏంటంటే ...వీరిలో ఇద్దరు మాత్రమే కవలలు. మరి వారెవరో గుర్తుపట్టండి చూద్దాం.

పసుపు పులిమేస్తే పోలా!

బుజ్జాయిలూ... మీకు రంగులు అద్దడమంటే చాలా ఇష్టం కదా. అందుకే ఆర్టిస్టు అంకుల్ మీకోసం ఈ బొమ్మ పంపాడు. కాకపోతే అంతా గీతలు గీతలుగా కనిపిస్తుంది. తమాషా ఏమంటే ముందు అంకుల్ రెండు జంతువుల బొమ్మలు వేశాడు. అవి ఒకదాన్ని మరొకటి తరుముతున్నట్టు గీశాడు. తర్వాత వాటిపైన గీతలు గీసేశాడు. ఆ రెండు జంతువులు ఏవో తెలియాలంటే... ఒక క్లూ ఇస్తాం. సున్నా చుట్టిన గడుల్లో పసుపు రంగు అద్దేయండి. అప్పుడు అంతా తెలిసిపోతుంది.





చుక్కలు కలిపేద్దాం

ఫ్రెండ్స్! ఇక్కడ చుక్కల్లో చిక్కినదెవరో చెప్పుకోండి చూద్దాం. తెలీడంలేదా! అలాగంటే ఎలాగర్రా. 1 నుంచి 54 వరకు చుక్కలు కలిపేయండి. ఎవరో చెప్పేయండి.

ఏమేం వున్నాయి?

చిన్నారులూ... ఈ ప్రాణిని చూస్తుంటే మీకు ఏమేం గుర్తొస్తున్నాయి? ...కదా! మరి ఆ రెండు జంతువులు ఏవో చెప్పుకోండి!



ఎక్కడున్నాయి?

పై బొమ్మలో ఐదు వస్తువులు దాక్కున్నాయర్రా. అవేంటంటే... కొమ్ము బూర, అప్పడాల కర్రలు, ట్రంపెట్, గొడ్డలి, ఒడిసెల... ఈ బొమ్మలోనే చిన్న చిన్న చదరాల్లో వాటి ఆకారాలు కనిపిస్తున్నాయే. అవన్నమాట. అవి పెద్ద బొమ్మలో ఎక్కడో దాక్కున్నాయి. మీరే చూసి గుర్తించాలి. కనిపించగానే సున్నా చుట్టేయండే.

చెట్టులో చిక్కిన వారెక్కడబ్బా...

అబ్బో...భలే చిక్కు వచ్చి పడిందే. చెట్టు లోపలి అక్షరాల్లో 15 పదాలున్నాయి. అయితే అవి గబుక్కున కనిపించి చావవు. మనమే వెతికి పట్టుకోవాలి. అడ్డంగా, నిలువుగా, వంకరగా... ఎలాగైనా సరే. బాగా చూడండి. కనిపించగానే సున్నా చుట్టేయండి. ఎన్ని పదాలు కనిపెడితే అన్ని మార్కులు వచ్చినట్టు.



M	T	R	C	P	O	P	E	B	C	T
I	I	R	D	E	O	L	A	L	O	C
F	E	C	E	N	T	I	C	E	E	O
I	V	C	A	R	O	A	E	D	T	A
C	I	T	Y	L	A	M	A	L	U	C
N	L	M	L	P	K	R	L	F	N	K
P	O	M	E	G	R	A	N	A	T	E
C	O	F	I	I	M	E	D	T	S	M
A	K	P	M	F	T	N	S	Z	E	E
O	W	I	L	L	O	W	E	S	H	Y
E	R	O	M	A	C	Y	S	X	C	H
A	K	A	Y	R	R	E	B	L	U	M

ALMOND ALOE CEDAR CHESTNUT CYPRESS
FIG FIR MULBERRY MYRTLE OAK ~~OLIVE~~
POMEGRANATE POPLAR SYCAMORE WILLOW



డాక్టర్ దగ్గరకెళ్లేదెలా?

ఒకరికి అకస్మాత్తుగా జబ్బు చేసింది. డాక్టర్ దగ్గరకెళ్లాలి. గజిబిజి దారులేమో బోలెడు కనిపిస్తున్నాయి. మరి మీరైనా దగ్గర దారి చెప్పొచ్చుగా.

మాటల కోట - 33

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1	2	■	3	4		■	5	6
7			■		■	8		
■		■	9		10	■		■
11	■	12		■	13	14	■	15
16			■	17	■	18		
	■	19	20	■	21		■	
■	22	■	23	24		■	25	■
26			■		■	27		28
29		■	30			■	31	

అడ్డం :

1. పత్తి వ్యవహారికం (2)
3. గతం, పూర్వం, ఇంతకు ముందు (3)
5. గొట్టం, తొర్ర, ఆంగ్లంలో పైపు (2)
7. కుండలో ఆవిరి ద్వారా వండే వంట. వినాయకుడికి ఇష్టమైనవని చెప్పే ఉండ్రాళ్లకు తోడివి (3)
8. గత ఏడాది ఇక్కడ తిరగబడి కనపడుతోంది చూడండి (3)
9. గీకు, రాపిడి చేయు (3)
12. ఏనుగు, కారు నలుపు అని కూడా (2)
13. దారి మార్చిన అక్క. పల్లెల్లో విన్పించే పిలుపు ఇది (2)
16. సుధతో 'వ' కలిసిన భూమి (3)
17. స్తంభించిన రాకపోకలు ఆంగ్లంలో (1)
18. సాక్ష్యం, నిరూపణ (3)
19. నంద్యాలలోని జంతువు (2)
21. మొక్క పరిసరం (2)
23. అంతరిక్షం, ఆకసం, మిన్ను, మన పైభాగం (3)
26. ఆయా ఆద్యంతాలతో అతి పెద్ద ఖండం (3)
27. "గోదారి గట్టుంది. గట్టుమీద చెట్టుంది, చెట్టు మీద పిట్టుంది. పిట్ట మనసులో ఏముందో..." అంటూ పాత సినిమాలో ఉర్రూతలూగించిన నటి (3)
29. సందు, రంధ్రం, నీటి వరవడికి కట్ట తెగటం, కోత (2)
30. మరిన్ని, ఎక్కువ, అధికం, విస్తారం, వెడల్పు, విశాలం (3)
31. ఈ పెంపుడు జంతువుకు విశ్వాసం ఎక్కువట(2)

నిలువు :

1. పొట్టి దుముకు (2)
2. చెల్లాచెదరయిన దిగటం, కిందికి (3)
4. నొసలు, స్త్రీలు బొట్టు పెట్టుకునే ప్రాంతం (3)
5. తూర్పును సాగదీయండి (3)
6. ఈయన మౌనంగా తపస్సు చేసుకుంటాడట, రుషి అని కూడా అంటారు. (2)
9. అసలు అర్థం హద్దు. అయితే ఇప్పుడు 'ఎన్నికల్లో పోటీ చేయటాన్ని దీనిలోకి దిగాడని రాస్తున్నాము (2)
10. పోగు (2)
11. పెరుగు వడ (3)
12. కథ చెప్పే పద్ధతి. ఇక్కడ ఒకదానికి ఉండాల్సిన బొడ్డు లేదు (3)
14. తక్కువగా, ఎప్పుడన్నా, అప్పుడప్పుడు (3)
15. చదరంగంలో రాజు మొదలు, సైనికులదాకా అన్నింటినీ కలిపి ఇలా పిలుస్తారు (3)
20. కింద నుంచి తొలి, మొదలు, ప్రారంభం (2)
21. తాడు, బంధం (2)
22. బంగారం (3)
24. కాపలాకాయువాడు, ఏసుక్రీస్తును ఆయన భక్తులు ఇలా కీర్తిస్తారు (3)
25. డప్పు చేసే ప్రకటన (3)
26. గోల, అల్లరి, పాడయిపోయిన, నాశనం (2)
28. ఊళ వేసే జంతువు, కుక్కలాంటిదే (2)

మాటలకోట - 32జవాబు

1 బ	డి	■	2 సం	త	■	3 గు	డ్డ	■
స	■	పా	చి	■	5 వ	రి	■	6 మ
■	7 నూ	లు	■	8 ది	న్నె	■	9 ఘ	నం
10 పా	రు	■	11 ఆ	శ	■	12 కూ	టం	■
ప	■	13 పు	దా	■	14 ప	న	■	15 చ
■	16 తీ	రం	■	17 జు	న్ను	■	18 మ	లి
19 పో	రు	■	20 క	ర్రు	■	21 మూ	ర	■
పో	■	22 వా	సి	■	23 నూ	క	■	24 ఆ
■	25 లా	గు	■	26 పో	గు	■	27 పా	ట

నక్క - వేటగాడు

చిట్టి, చిట్టి వాళ్ల అమ్మ అడవికి దగ్గరలో వున్న గ్రామంలో నివసించేవారు. వారికి ఓ బామ్మ వుండేది. ఆమె అడవిలో నివసించేది. క్రిస్టమస్ సందర్భంగా బామ్మకు కేకు, తేనె ఇచ్చిరమ్మని పంపుతుంది తల్లి. అయితే అడవిలో జాగ్రత్త అని కూడా చెప్తుంది. తేనె సీసా జాగ్రత్తగా తీసుకెళ్లమని మరీ మరీ చెప్తుంది. సరేనని వెళ్తుంది చిట్టి.

కేకు, తేనె సీసా బుట్టలో పెట్టుకొని బామ్మ దగ్గరకు బయలుదేరుతుంది. దారిలో పాటలు పాడుకుంటూ పక్షులు, సీతాకోక చిలుకలు చూసుకుంటూ ముందుకు నడుస్తుంటుంది. ఈలోగా పాప పాటలు ఓ నక్కకు వినిపించి దగ్గరకొస్తుంది. పాపను చూసేసరికి దానికి నోరూరుతుంది. మంచి ఆహారం తన దగ్గరకు నడిచి వచ్చినట్టు భావిస్తుంది. పాపను మాటల్లో పెట్టి ఎక్కడికెళుతోందీ తెలుసుకోవాలనుకొంటుంది.

"పాపా...భలే ముద్దుగా వున్నావే! నీ పేరేంటి?ఎక్కడికెళుతున్నావ్?" అంటుంది.

"నా పేరు చిట్టి. నేను... మా బామ్మ దగ్గరకెళుతున్నా. క్రిస్మస్ బహుమతి ఇవ్వడానికి" అంటుంది పాప.

"అవునా! మంచి మనవరాలివే. ఇంతకీ ఏమేం తీసుకెళుతున్నావ్?"

"కేకు, తేనె సీసా"

"ఓ...ఇంతకీ మీ బామ్మ ఇల్లెక్కడ?"

"అదిగో ఆ కొండ మలుపు తిరగగానే కనిపిస్తుంది"

"సర్సరి..నాకు పని వుంది. వస్తానే" అంటూ వెళ్లిపోతుంది నక్క

★★★

పాప చెప్పినదాన్నిబట్టి అక్కడ తనకోసం మరో మాంచి ఆహారం వుందని లొట్టలు వేసుకొంటుంది నక్క గబగబా అక్కడకు వెళ్లి తలుపు కొడుతుంది. బామ్మ నీరసంగా "ఎవరూ" అంటుంది. "నేను చిట్టిని. నీకోసం కేకు తెచ్చాను" అంటుంది నక్క తలుపు తీసుకొని లోపలికి రమ్మంటుంది బామ్మ. నక్క మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్లి బామ్మను అమాంతం మింగేస్తుంది. తర్వాత పాపను తినాలన్న ఆశతో బామ్మడ్రస్సు వేసుకొని మంచం మీద అటు తిరిగి పడుకొంటుంది.

కాసేపటికి పాప వస్తుంది. అయితే ఇంటి తలుపు తీసి వుండడంతో అనుమానం వేస్తుంది. అందుకే బామ్మను పిలుస్తుంది. నకే బామ్మ స్వరంతో మాట్లాడి లోపలికి రమ్మంటుంది. పాప వస్తుంది. నక్క మీద చెయ్యి వేసి "బామ్మా నీకోసం కేకు, తేనె తెచ్చాను. తిను..." అంటూ ఇటు తిప్పుతుంది. బామ్మ కొత్తగా కనిపిస్తుంది.

"బామ్మా! నీకు ఇంత పెద్ద కళ్లున్నాయే"

"అవును. నిన్ను బాగా చూడ్డానికి"

"నీకు ఇంత పెద్ద చేతులున్నాయే"

"నిన్ను ప్రేమగా దగ్గరకు తీసుకోవడానికి"

"నీకు ఇంత పెద్ద నోరుందే"

"నిన్ను తినడానికి" అంటూ అమాంతం పాపను దగ్గరకు తీసుకొని మింగేస్తుంది. ఆ తర్వాత దానికి మత్తుగా అనిపించి మంచంలో పడి నిద్రపోతుంది. పెద్దగా గురకలు కూడా తీస్తుంటుంది. ఈలోగా అటుగా ఓ వేటగాడు వచ్చి ఈ గురకలు వింటాడు. కిటికీలోంచి చూస్తే మంచం మీద నక్కపడుకొని వుంటుంది. అది అంత పెద్దగా గురకలు పెడుతుండడం, పొట్ట అంత పెద్దగా వుండడంతో అనుమానం వస్తుంది. బామ్మను అది మింగేసి వుంటుందని ఊహిస్తాడు. వెంటనే తన దగ్గరున్న కత్తెర తీసుకొని నక్కపొట్ట కోస్తాడు. అంతే చిట్టి, బామ్మ ఇద్దరూ బయటకొస్తారు. నక్కకు బుద్ధి చెప్పడం కోసం రెండు బండరాళ్లను దాని పొట్టలో పెట్టి కుట్టేస్తాడు. ఆ తర్వాత నక్క లేచి బరువుగా ఉన్న పొట్టతో నడవలేక నడుస్తూ కింద పడి చనిపోతుంది.

అప్పుడు ముగ్గురూ సంతోషిస్తారు. కొత్త వాళ్లెవరైనా కనిపించి సొంత విషయాలు అడగంగానే చెప్పకూడదని, చెప్తే ఇలాంటి సమస్యలు వచ్చే ప్రమాదం వుందని ఇద్దరూ పాపకు చెప్తారు.

*

రా... రమ్మని...





వావ్...ఏం డిజైన్లు...ఏం రంగులు! చూస్తుంటేనే రా...రమ్మని పిలుస్తున్నట్టుంది. వెళ్లిపోయి కూర్చోవాలనిపిస్తోంది వాటిలో. కుర్చీల మీద వేసిన పూల పూల డిజైన్లు కట్టిపడేస్తున్నాయా! అసలు కుర్చీల మీద డిజైన్లు ఎందుకనుకున్నారో ఏమో! ఏకంగా కమలం వంటి కుర్చీలనే చేసేశారు. వీటికితోడు జిరాఫీ, జీబ్రా చారల బల్లలు. జిరాఫీచారల కాళ్లకు జిరాఫీ మెడ వంటి కుర్చీలు. టీ కప్పులాంటి కుర్చీలు. సిమెంటు బస్తాలను ఒకదానిపై ఒకటి పొందిగ్గా సర్దినట్టున్న సోఫాలు. 'అసలు ఎవరిదీ సృజన?' అంటే ఏమో! ఎప్పుడూ క్షణం తీరికలేక వెతుకులాడుతుండే నెటిజన్లు మీకోసం పంపారు. ఆస్వాదించండి మరి.